ఆశను చుట్టిన అరిష్టాలు

ఏ. వీ. మోహన్రావ్

ఆఖరి దమ్ములాగి సిగరెట్ డస్ట్‌బిన్‌లోకి విసిరాడు అశోక్.

అతడికి విపరీతంగా విసుగుపుట్టుకొచ్చింది. సరయిన టైమ్‌కు వచ్చివుంటే విమానం ఆరుగంటల ముందువచ్చి వుండవలసింది.

బొంబాయిలో ఎయిర్‌పోర్టు ఎంప్లాయిస్ సమ్మె ఆకస్మికంగా ప్రారంభించారనీ, అందువల్ల విమానాల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నదనీ, ఏక్షణంలోనైనా విమానం రావచ్చనీ పదినిముషాలకొకమారు లౌడ్‌స్పీకరులో గొంతు చించుకొని చెపుతున్నాడు అనౌన్సరు.

బాస్‌పైన కోపమొచ్చింది. కార్లోనో రైల్లోనో

తగలబడితే గంట అటూ ఇటూగా వచ్చి వుండేవాడు. కానీ ఆయనరాడు. విమానాల్లో తిరగటం స్టేటస్. ఏ మధ్య దారిలోనో కూలిఛస్తాడేమోనన్న అనుమానం వేసింది.

అశోక్ ఉద్యోగంలో చేరి ఆరునెలలయింది. అతను బాస్‌ను ఎప్పుడూ చూడలేదు. విన్నాడు. ఆయన సెక్రటరీవచ్చి అశోక్‌ను ఇంటర్వ్యూ చేసి మద్రాసులో ఆయన కున్న వ్యాపారాలన్నింటికీ మేనేజర్‌గా నియమించి పోయాడు.

వెయ్యిరూపాయలు జీతం ఇస్తున్నారు. ఒంటరిగాడు అతడు. వెనకా ముందూ ఎవ్వరూ లేరు.

తినడం త్రాగడం అందమైన అమ్మాయిలతో పరిచయాలు పెట్టుకొని, అవకాశం దొరికితే వాళ్ళతో ఆనందంగా గడపడం అతని అలవాట్లు.

ఏ పరిస్థితుల్లోనూ ఏ అమ్మాయితోనూ అతను ప్రేమ గీమాలు పెట్టుకోలేదు. అతనికి ప్రేమపైన, పెళ్ళిపైన సదభిప్రాయం లేదు.

అశోక్ యం.కామ్ చదివాడు. రకరకాల ఉద్యోగాలు చేశాడు. రేపటిగురించి ఆలోచించడం అతని కలవాటు లేదు.

బాస్ గుర్తుకొచ్చాడు.

విమానంలో కూర్చొని ఎప్పుడెప్పుడు బయలుదేరు తుందాని ఎదురుచూస్తుంటాడనుకున్నాడు.

ఆరోజు అతనికి మంచి పార్టీ వుంది. ఆఫీసులో పని చేసే వనజ ఇస్తానంది. ఆరాత్రంతా అతనితో వుంటా నని కూడా చెప్పింది. బాస్ ట్రంకాల్ చేసి చెప్పాడు తను వస్తున్నట్లు. కారు తీసుకుని ఎయిర్‌పోర్ట్‌కు వచ్చి

వుండమని హుకుంజారీ చేశాడు.

వనజకు పరిస్థితి వివరించి, సర్ది చెప్పి పంపాడు. ఆమె నొచ్చుకుంటూ వెళ్ళిపోయింది. అశోక్ కారుతీసుకుని విమానాశ్రయాని కొచ్చేశాడు.

జాంమ్ మంటూ రొదచేసుకుంటూ పెద్ద విమానం టెర్మినల్ చుట్టూ తిరగసాగింది.

లౌడ్ స్పీకర్లో బొంబాయి నుండి వచ్చిన విమానం మరో రెండు నిముషాల్లో లాండ్ కాబోతూందని అనౌన్సరు గొంతు బాదుకొని చెప్పాడు.

అశోక్ వడివడిగా రన్ వే వేపు పరుగెత్తాడు.

విమానం ఆగింది. లాడర్ వేశారు. తలుపు తెరుచు కొంది. నలుగురైదుగురు దిగి క్రిందకొచ్చారు. వాళ్ళ వెనుక పొట్టిగా, లావుగానున్న బట్టతల వ్యక్తి వెలుపలి కొచ్చి క్రిందున్న జనం కేసి చూశాడు. గుర్తుపట్టాడు అశోక్ అంతకు క్రితం అనేకసార్లు ఆఫీసులో బాస్ ఫోటో చూడటంవల్ల.

అశోక్ చెయ్యిపైకెత్తి గాల్లో ఊపాడు.

బాస్ కూడా చెయ్యి ఊపాడు. ఆ తర్వాత మెల్ల మెల్లగా అడుగులు వేసుకుంటూ మెట్లుదిగి రాసాగాడు. ఆయన వెనుకగా ఆరడుగుల పొడవున్న అమ్మాయి దిగ సాగింది.

అశోక్ ఎదురువెళ్ళి తన్నుతానే పరిచయం చేసు కొన్నాడు.

బాస్ వెనక్కి తిరిగిచూచి "కమాన్ బేబీ! మన మానేజర్ వున్నాడు" అన్నాడు.

ఆ అమ్మాయివచ్చి తండ్రి ప్రక్కగా నిలుచుంది.

"మా బేబీ!" అన్నాడు బాస్.

"గ్లాడ్ టు మీట్ యూ!" అన్నాడు అశోక్ నవ్వు మొఖాన్న వెలిగించి.

బేబీ అశోక్ కేసి చూసింది. భారీ విగ్రహం. కోల మొహం. ఉంగరాల జుట్టు, వెడల్పైన ఛాతీ, మోకాళ్లను దాటిన చేతులు, ఖరీదైన సూటులోవున్న అతని రూపం ఆమెకు అత్యంత మనోహరంగా కనుపించింది.

"వెరీ గ్లాడ్ టు సీయూ!" అంది నవ్వుతూ.

అశోక్ ఆమె కేసి చూశాడు. బెల్ బాటమ్స్ తొడుక్కుంది. బెల్ షర్టు వేసుకుంది. వెంట్రుకలు పొట్టిగా కత్తిరించుకుని, మధ్య పాపట తీసుకుంది. చెవులకు ప్లాస్టిక్ పూలలాంటి వేవో వ్రేలాడసాగాయి. పెద్ద పెద్ద అద్దాలున్న గాగుల్స్ తగిలించింది. ముక్కు మాత్రం పెద్దదిగా మొఖాన్ని దాచేస్తూ ముందుకు పొడుచుకొచ్చింది.

అన్నింటికన్నా అతనికి కొట్టొచ్చినట్లు కనిపించిన లోపం, ఆమె ఛాతీ టెన్నిస్ కోర్టులా చదరంగా వుండటం. అసలు ఎవ్వరన్నా చెపితే తప్ప ఆమెను ఆడ మనిషని ఎవ్వరూ గుర్తించలేరు.

"కారు వెలుపలుంది. వెళ్దామా!" అడిగాడు అశోక్.

"మాకు రూంస్ బుక్ చేశావా?" అడిగాడు బాస్.

"ఆఁ! ఓషియనిక్‌లో ఏ. సీ. రూంలు రెండు రిజర్వు చేశాను. ఆఫీసునుండి ఇద్దరు బాయ్స్‌నుకూడా అక్కడకు పంపాను" అన్నాడు అశోక్.

"వండర్‌ఫుల్! ఐ లైక్ యూ!" అన్నాడు మెల్లగా నడవలేక నడవలేక అడుగులు ముందుకేస్తూ.

అందరూ కారెక్కారు. అశోక్ వీల్ వద్ద చేరాడు. ప్రక్కనే బేబీ కూర్చుంది. బ్యాక్ సీట్‌లో బాస్ చేరబడ్డాడు.

రివ్వుమంటూ దూసుకుంటూ పోసాగింది కారు.

ఒక్క చేత్తోనే డ్రైవ్ చేస్తున్న అశోక్ కేసి చూడ సాగింది బేబీ. ఎనభైకి తగ్గకుండా పోతున్నాడు. సులువుగా టర్నింగ్ లు కొడుతూ, ఓవర్ టేక్ చేస్తూ పోతున్న కారును చూసి అశోక్ డ్రైవింగ్ ను లోలోపలే మెచ్చు కుంది బేబీ.

కారు ఓషియానిక్ చేరింది. దిగి తిన్నగా రూంకు వెళ్ళారు.

అశోక్ గంట చూశాడు. రాత్రి రెండయింది.

"మిస్టర్ అశోక్!" పిలిచాడు బాస్.

అశోక్ ఆయనకేసి చూశాడు.

"నిన్ను చాలా ఇబ్బంది పెట్టినట్టున్నాను. ఇంక నువ్వు వెళ్ళవచ్చు. అమ్మాయి రేపు ఆఫీసుకు వస్తుంది. ఇక్కడ మన బిజినెస్ లో వున్న లావాదేవీలు, సమస్యలు అన్నీ ఆమెకు చెప్పు" అన్నాడు.

"అలాగే!" అన్నాడు అశోక్.

బేబీ దగ్గ "మీకు అభ్యంతరం లేకుంటే పదింటికి ఇక్కడకు రండి. కలిసి వెళ్దాం!" అంది.

"ష్యూర్! అలాగే వస్తాను మేడమ్" అన్నాడు అశోక్.

"ఇంక మీరు వెళ్ళండి! ఇంట్లో మీ వాళ్ళు ఎదురు చూస్తూ వుండవచ్చు."

"నాకెవ్వరూ లేరండీ ఎదురు చూసేందుకు."

"అయితే మీరుకూడా ఇక్కడే వుండిపోవచ్చుగా!" సజెస్ట్ చేసింది బేబీ.

"వద్దులెండి నేను తొందరగా ఆఫీసుకు వెళ్ళి కొన్ని

కాగితాలు తయారు చెయ్యాలి. మీరు వచ్చేసరికి అంతా సిద్ధంగా వుంచాలి కదా! వస్తాను,'' అంటూ ఎదురుచూడకుండా అక్కడ్నించి నిష్క్రమించాడు అశోక్.

వెలుపలకొచ్చి కారెక్కాడు.

కోట్లమీద వ్యాపారం చేస్తున్న బాస్ రూపం పదే పదే తలపుకొచ్చింది అశోక్‌కు. తన్ను ఎన్నో ప్రశ్న లడుగుతాడనుకున్నాడు కానీ ఆయన ఏమీ అడగలేదు.

బేబీ చూపులు, నవ్వులు, మాటలు గుర్తుకొచ్చాయి. శరీరం కంపించింది. ఆడవాళ్ళతో అశోక్‌కు బాగా అనుభవముంది. వాళ్ళ ప్రవర్తనను బట్టి మనసుల్లో ఎలాంటి భావాలు చెలరేగేది కనిపెట్టగలడు తను.

బేబీ తన్నెందుకో మెచ్చుకొంటున్నట్లుగా చూడడం అతన్ని కాస్త కలవర పరిచింది.

ఆమె బాస్‌కు ఒక్కతే కూతురు. మనిషిని చూస్తే ముప్ఫయి సంవత్సరాల దాకా వయసున్నట్లుగా తోచింది. ఆడదాని వొంపే అణకువ, అసలు కనిపించలేదు. బహుశా డబ్బు దాన్ని అణచివేసిందేమోననుకున్నాడు.

వనజ గుర్తొచ్చింది. టైం చూసుకున్నాడు. వీళ్ళు రావడం లేకుంటే ఈ పాటికి వనజతో సరదాగా కాలం గడుపుతూ వుండేవాడు.

వ్యాపార వ్యవహారాలన్నీ గుర్తొచ్చాయి. అన్నీ సవ్యంగానే వున్నాయి. తను చేరిన యీ ఆరుమాసాల్లో అన్ని కంపెనీలు కలిసి దాదాపు యాభై లక్షలదాకా వ్యాపారం చేశాయి. అందులో పదోవంతయినా లాభం వుండి తీరుతుంది.

కారు చిన్న బంగళా ముందాగింది. దిగి లోనికి

వెళ్ళాడు. డ్రస్ మార్చుకుని ఒక గ్లాసు విస్కీ త్రాగాడు.

ఆరు గంటలకు అలారం పెట్టి ప్రక్కమీదికి వాలి పోయాడు.

2

ఏడంతస్తుల 'ఎమరాల్డ్ హౌస్' ముందాగింది టాక్సీ.

అందులోంచి ఆరడుగుల అజానుబాహు విగ్రహం దిగింది. టాక్సీవాలాకు డబ్బిచ్చి, చిన్న బ్రాండ్ కేస్ ఊగించుకుంటూ అతను బిల్డింగులోనికి నడచాడు. వెళ్ళి లిఫ్ట్ వద్ద ఆగాడు.

బటన్ నొక్కగానే లిఫ్టు పైనుండి సర్రుమంటూ క్రిందికొచ్చింది. తలుపులు తెరచుకుని లోనికి వెళ్ళాడు. మళ్ళీ తలుపులు మూసుకుని 'ఏడు' నెంబరు దగ్గరున్న బటన్ నొక్కాడు.

కన్ను మూసి తెరచేంతలో లిఫ్టు ఏడో అంతస్తు ముందాగింది. వెలుపలకు అడుగుపెట్టాడు. జేబులోంచి ఫిల్టర్ ఫ్లేక్ సిగరెట్ పెట్టె తీసి ఎడంచేత్తో పట్టుకున్నాడు ముందుకు నడిచాడు.

'ప్రైవేట్' అని వున్న తలుపు వద్ద ఆగి అద్దాల గుండా లోనికి చూశాడు. విశాలమైన హాలులాంటి పెద్ద గది. ఒక మూల అందమైన అమ్మాయి ఏదో లెఖలు చూస్తూ కనుపించింది.

తలుపు తోసుకుని లోనికి వెళ్ళి ఆమె ముందు నిలబడ్డాడు. ఆమె ఆగంతకుణ్ణి గమనించకుండా తన పనిలో తను నిమగ్నురాలైపోయింది. తన ఉనికిని తెలిపేందుకన్నట్లు పొడిగా దగ్గాడు. ఆమె తల పైకెత్తి చూసింది.

"మిస్టర్ తారానంద్!" అన్నాడు అతను.

"మీరెవరు?"

"క్రిస్టోఫర్ అని చెప్పండి."

"ఏం పనిమీదొచ్చారు? ఎంత సేపు మాట్లాడాలి?"

"మీ ప్రొప్రయిటరుగారి పనిమీదే వచ్చాను. ఆయన నాతో ఎంతో సేపు మాట్లాడవలసిన అవసరముంది. అయినా నేను అరగంటకన్నా ఎక్కువ సేపు మాట్లాడను."

ఆమె నవ్వింది. సొట్టలు పడుతున్న బుగ్గలు, ధగధగ మెరిసిపోతున్న వెడల్పాటి చక్కని బలమైన పళ్లు, రక్తం పైకి చిమ్ముకొంటున్నట్లున్న లావైన రొమ్ములు, నెమలి రంగు కళ్లు, చకచక సర్వే చేశాడు క్రిస్టోఫర్.

ఆమె ముందుకు వంగి టెలిఫోన్ రిసీవరు పైకె త్తింది.

"మీరలా సోఫాలో కూర్చోండి. బాస్‌తో మాట్లాడి అపాయింట్ మెంట్ ఫిక్స్ చేస్తాను" అందామె.

"నో! మిమ్మల్ని చూస్తూ ఇక్కడే నిలుచుంటాను. మీ పని కానివ్వండి" అన్నాడు క్రిస్టోఫర్ ఫ్లేక్ సిగరెట్ తీసి ముట్టిస్తూ.

ఆ అమ్మాయి ఫోన్లో మాట్లాడుతూనే క్రిస్టోఫర్‌ను తలెత్తి చూడసాగింది. అతని అందం ఆమెను అప్రతిభురాల్ని చేసింది.

"మిమ్మల్ను రమ్మన్నారు!" అందామె.

"థాంక్స్! మీ పేరు చెప్పలేదు!" అడిగాడు నవ్వుతూ క్రిస్టోఫర్.

"మిస్ స్వప్న" మొదటి మాట ఒత్తి పలికింది.

"గుడ్ నేమ్! వస్తాను" అంటూ అతనూ లోనికి దారి తీశాడు.

రెండు నడవల్లు, మూడు హాలులు దాటాక, నాలుగో గదిలో వున్నాడు తారాచంద్. అతని చుట్టూ రక

రకాల నగల ఫొటోలు గోడలకు తగిలించి వున్నాయి. ఎయిర్ కండిషన్ గది కావడంవల్ల చల్లగా వుంది. తెల్లటి పరుపుపై దిండ్లు నానుకుని కూర్చున్నాడు తారాచంద్.

"గుడ్ మార్నింగ్ చంద్ జీ!" కూర్చున్నాడు క్రిస్టోఫర్.

"గుడ్ మార్నింగ్!" అంటూ "ఏం తాగుతావ్?" అడిగాడు.

"ఏమిచ్చినా తాగుతాను, విషం తప్ప!"

"అది నా దగ్గర లేదులే!" అంటూ బెల్ నొక్కాడు. బాయ్ వచ్చాడు. విస్కీ సీసా, ఐస్, సోడాలు, గ్లాసులు, జీడిపప్పు తెమ్మన్నాడు.

"ఊఁ! అసలు విషయం చెప్పు" అన్నాడు క్రిస్టోఫర్.

"ఈ మధ్య నువ్వు నాతో వ్యాపారం పూర్తిగా మానేశావ్. రతన్ చంద్ కు సరుకు ఇస్తున్నావని ఎవరో చెప్పారు. అతనంటే నాకు పడదు. నువ్వు అతని దగ్గరకు వెళ్ళడం కూడా నాకు నచ్చలేదు. ఐదేళ్ళనాడు మనం వ్యాపారం చేశాం. నిన్ను నేను ఎంతబాగా చూశానో గుర్తుందికదా! మరి నువ్విలా ఎందుకు మారిపోయినట్లు?" అడిగాడు తారాచంద్.

క్రిస్టోఫర్ కు అర్థమయింది. తారాచంద్ తో వ్యాపారం చేస్తున్న రోజుల్లోనే పోలీసులకు పట్టుబడ్డాడు. తనవద్ద సరుకు దొరకలేదుగానీ, సాక్ష్యాధారాలతో మూడేళ్లు జైలు శిక్షపడింది. అది పూర్తి చేసుకుని బైటపడ్డాడు. తన అనుచరులు చెల్లాచెదరయ్యారు. బొంబాయిలో కాలక్షేపం చెయ్యసాగాడు. జరుగుబాటుకు రతన్ చంద్ దగ్గర రెండు మూడుసార్లు డబ్బు తీసుకున్నాడు. తానేదో మంచి సరుకు తెస్తానన్న ధైర్యంతో ఇచ్చాడు డబ్బు.

కిం తారాచంద్ పదిరోజుల క్రితం బొంబాయి వచ్చాడు. శాంతాక్రజ్ లో కలిశాడు. మద్రాసు రమ్మని బ్రతిమి లాడాడు. అందుకే వచ్చాడు క్రిస్టోఫర్.

"అగలీమధ్య నేనేమీ చెయ్యలేదు ఊరకే తిని తిరుగుతున్నాను" చెప్పాడు క్రిస్టోఫర్.

"ఏం మానేశావా?"

"కావాలని మానలేదు. నా అనుచరులు ఏమయినారో తెలీలేదు. వ్యాపారం ప్రారంభించాలంటే మళ్ళీ పెట్టుబడి కావాలి. అంగబలం కావాలి. అందుకే వెనుక ముందు లాడుతున్నాను."

"పెట్టుబడి గురించి కంగారు పడక. నేనిస్తాను. అంగబలం నువ్వు సరుకూర్చుకో. నా పరిస్థితిగూడా అంత బాగాలేదు. ఈ మధ్య వరుసగా ఐదేళ్లు నష్టం వచ్చింది. నువ్వైనా చేస్తేతప్ప నేను బైటపడేట్లు లేదు!" అన్నాడు తారాచంద్.

బాయ్ మందు తెచ్చిపెట్టి వెళ్ళిపోయాడు.

ఇద్దరూ మెల్లిగా పుచ్చుకోసాగారు.

"నువ్వేదన్నా పథకం ఆలోచించావా?" అడిగాడు క్రిస్టోఫర్.

"ఆఁ! గత రెండేండ్లలో నా దగ్గర ఎక్కువ ఖరీదులో వజ్రాలు కొన్నవాళ్ళ అడ్రసులున్నాయి. అన్నీ కలిపి ఆరో ఏడో వుంటాయి. వాటిన్ని ఊడ్చుకొస్తేచాలు. వాటి అసలు ఖరీదులో మూడోవంతు నీకిస్తాను. ఈ ప్లాను సవ్యంగా సాగిపోయేందుకవసరమయిన పెట్టుబడి నేనే పెడతాను. ఏమంటావ్?"

"ఓ. కే. అలాగే చేద్దాం ముందు సాదు పాతిక వేలు కావాలి ఇస్తావా?" అడిగాడు క్రిస్టోఫర్.

వెనుక వేపు నున్న అల్మైరా తెరచి, అందులోంచి మూడు వందరూపాయల నోట్ల కట్టలు వెలుపలికిలాగాడు. తలుపు మూసి డబ్బు క్రిస్టోఫర్‌కు అందించాడు.

“ప్లాను చాలా పకడ్బందీగా వెయ్యాలి. చిక్కామా చిక్కుల్లో పడతాం. దాంతో మన దరిద్రాలు తీరిపోతాయి” అన్నాడు తారాచంద్.

“అలాగే! ఆ అడ్రసులు ఒక కాగితంపైన రాసివ్వు” అన్నాడు గ్లాసులోకి విస్కీ వంచుతూ క్రిస్టోఫర్.

తారాచంద్ టైప్ చేసిన కాగితాన్నొకదాన్ని అందించాడు. ఓమారు చదివి మడిచి కోటుజేబులో పెట్టుకున్నాడు క్రిస్టోఫర్ దాన్ని.

“మనం మళ్ళీ ఎప్పుడు కలుద్దాం!” అడిగాడు క్రిస్టోఫర్.

“అవసరం లేదు. సరుకు చేతికి రాగానే ఫోన్ చెయ్యి. నువ్వు ఎక్కువ సార్లు ఇక్కడకు రావడం అంత మంచిది గాదు.”

“బై ది బై నీకు లేడీ సెక్రటరీ వున్నట్లుంది. ఎటువంటి మనిషివి?”

“ఏం? కన్ను పడిందా?”

“అందుకాదు. అనవసరమైన విషయాల్లో జోక్యం కల్పించుకునే రకమాని.”

“కాదు! ఉద్యోగమిచ్చే ముందే చెప్పాను. కళ్ళు, చెవులు, పని చెయ్యకూడదని” అన్నాడు తారాచంద్.

“రైటో! నేను వస్తాను” అంటూ లేచాడు క్రిస్టోఫర్. బ్రాండ్ కేస్ తీసుకొని మళ్ళీ గదులన్నీ దాటుకుని తారాచంద్ సెక్రటరీ వున్న రూం దగ్గర కొచ్చాడు.

“థాంక్ యూ! మిస్ స్వప్న!” అన్నాడు.

"నో మెన్షన్! వెళ్ళిపోతున్నారా!" అడిగింది ఆతృతగా.

"ఆఁ! ఇక్కడ్నుంచి. కానీ హోటల్ పారడైజ్ రూం నెంబరు మూడొందలా మూడులో వుంటాను మరో మూడు రోజులు" అని అక్కడ్నుంచి వెలుపలికి నడిచాడు.

స్వప్న చూస్తూ కూర్చుంది.

3

ఫాన్ గిర్రుమని తిరుగుతూంది.

క్రిస్టోఫర్ బుర్ర అంతకన్నా స్పీడుగా తిరగసాగింది. మూడేళ్ళపాటు కఠినశిక్ష అనుభవిస్తూ కారాగారపు గోడలమధ్య ముక్కిపోయిన మనిషి తను. అంతకుముందు ధైర్యంగా ఎన్నో దొంగతనాలు చేశాడు. తెలివిగా తప్పించుకొన్నాడు. తన మనిషి చేసిన చిన్న పొరపాటుతో చిక్కిపోయాడు.

జైలునుంచి వెలుపలకొచ్చాక మానసిక స్థైర్యం సడలిపోయింది. దొంగతనాలు చెయ్యడమంటే భయం, రోత, పుట్టుకొచ్చాయి.

ఎన్నో ఊళ్లు తిరిగాడు. తన అనుచరులకోసం వెతికాడు. ఎవ్వరూ తగల్లేదు. అంతా చెల్లాచెదరయి చిల్లర నేరాలుచేస్తూ బ్రతకడమో, చావడమో చేస్తూ వుండొచ్చనుకున్నాడు.

తారాచంద్ ఇచ్చిన కాగితంతీసి చూశాడు.

అందులో మొత్తం ఆరు అడ్రసులు వున్నాయి. ఇద్దరు వ్యాపారస్థులు. ఒక సినిమా నటి, ఒక రాజకీయ నాయకుడు. మరొకతను పెద్ద ఆఫీసరు. ఆరో అడ్రసు డాక్టరుది.

అందరిదగ్గరా కలిపి కనీసం పాతిక లక్షలరూపాయలు

ఖరీదు చేసే సరుకు వుండివుండాలనిపించింది.

డేర్ డెవిల్ లాంటి అనుచరుడ్ని ఒకడ్ని ముందు సంపాదించుకోవాలనుకున్నాడు క్రిస్టోఫర్. అలాగే ఒక అందమైన అమ్మాయినికూడా తోడుంచుకోవాలి. తనకు తారాచంద్ అడ్రస్ లిచ్చిన వాళ్ళను గురించి పూర్తి వివరాలు సేకరించాలి. వాళ్ళ ఇళ్ళల్లో నగలు ఎక్కడ దాచిపెట్టారోకూడా తెలుసుకోవాలి. ఆ తర్వాతే వాటిని దోచుకునే దారుల గురించి ఆలోచించాలి.

గ్లాసులో విస్కీ పోసుకున్నాడు.

బజ్జర్ మ్రోగింది.

నవ్వుతూ లేచివెళ్ళి తలుపు తీశాడు క్రిస్టోఫర్.

ఎదురుగా స్వప్న కనుపించింది. ఆమె తప్పుకున లోనికొచ్చి తలుపు మూసింది.

"ఎందుకా కంగారు?" అడిగాడు క్రిస్టోఫర్.

"అందరూ చూడటం ఎందుకని" అంటూ వచ్చి క్రిస్టోఫర్ కు ఎదురుగావున్న కుర్చీలో కూర్చుంది.

"ఇంత ఆలస్యమయిందేం?"

"నేను కనపడ్డ ప్రతి మగాడివెంట తిరిగే బజారుదాన్ననుకున్నారా?"

"కాదు! నువ్వు పరిశీలించిన పద్ధతి, మాట్లాడిన తీరు చూస్తే, ఎందుకో నన్ను కలుసుకోవాలని ఉబలాటపడుతున్నావనిపించింది."

"కరెక్ట్! మీ ప్లానులేమిటి?" సూటిగా అడిగింది.

"దేన్ని గురించి?"

"వ్యాపారం గురించి!"

"నా వ్యాపారం నీకు తెలుసా?" అడిగాడు ఆశ్చర్యపోతూ క్రిస్టోఫర్.

"ఇంతకుముందు చేసిన వ్యాపారం గురించి తెలుసు. నీ ఫోటో పేపర్లో చూశాను మూడేళ్ళ క్రితం. నిన్ను ఇందాక చూడగానే పేరుమోసిన వజ్రాల దొంగ క్రిస్టోఫర్ వి నువ్వేనని సులభంగా గుర్తుపట్టాను. తారాచంద్ ఏమన్నాడు?"

ఆమె దగ్గర ఇంక తను వివరాలు దాచి లాభం లేదనిపించింది. అంతా పూసగ్రుచ్చినట్లు చెప్పి "నీ ఇంటరెస్ట్ ఏమిటి?" అడిగాడు.

"నువ్వొక్కడివీ ఈ దొంగతనాలను అర్గనైజ్ చెయ్యలేవనుకుంటాను. నీ కిచ్చిన అడ్రసుల కాగితం టైప్ చేసింది నేనే. దాని డూప్లికేట్ నా దగ్గరుంది. ఆ అడ్రసుల్లోవున్న వ్యక్తుల్లో చాలామంది సంవత్సరంలో ఎక్కువ భాగం ఇక్కడుండరు. బంగళాలను తాళాలు వేసి వెడుతుంటారు. అలా చేసేందుకు ఒక్కొక్కరికి ఒక్కొక్క కారణముంది" అంది స్వప్న.

"గుడ్! నా పని చాలా సులభం చేశావ్! ఇంకా నేను వీళ్ళ గురించి వాకబు చేద్దామనుకుంటున్నాను" అన్నాడు క్రిస్టోఫర్.

"అఖ్ఖర్లేదు" అంటూ హాండ్ బ్యాగ్ తెరచి అందులోంచి ఒక కాగితాల బొత్తి వెలుపలకి లాగింది స్వప్న. క్రిస్టోఫర్ కు అందించింది. అతను విప్పిచూశాడు.

"నువ్వెలా సేకరించావ్!"

"నా బాయ్ ఫ్రెండ్ సేకరించాడు."

"ఎందుకు?"

"నువ్వు చెయ్యదలచుకున్నట్టే అతనూ చేద్దామనుకుంటున్నాడు."

"మరి నాకెందుకు నువ్వీ వివరాలు చెపుతున్నావ్?"

"అతను అసాధ్యుడే! కాని అనుభవం శూన్యం. డబ్బు సంపాదించాలన్న ఆరాటం వుంది. అదీ నాకోసం. కానీ దొంగతనం చేసి పట్టుబడకుండా వుండే విధంగా ప్లాను చెయ్యాలి. అది మాకు ఎంత తలబద్దలు గొట్టుకున్నా అర్థంగావటంలేదు. ఒక ప్రయత్నం చేసి చిక్కుపడబోయి తప్పించుకున్నాడు అతికష్టంమీద. అందువల్లే అతన్ని ఎంకరేజ్ చెయ్యలేదు" అంది స్వప్న.

"గుడ్! మరి అతన్ని తీసుకు రాలేదేం?"

"ముందు మనం ఒకర్నొకరం అర్థంచేసుకుని వాటాలు నిర్ణయించుకొంటే ఆ తర్వాత కలుసుకోవడం బాగుం టుంది" అంది స్వప్న.

క్రిస్టోఫర్ సిగరెట్ వెలిగించాడు. స్వప్న చలాకీ తనం, అందం, అతన్ని ఆనందపరిచాయి.

"మీకెంత వాటా కావాలి!"

"తారాచంద్ ఎంత వాటా ఇస్తానంటున్నాడు."

"మనం దొంగిలించి ఇచ్చే సొమ్ములో మూడోవంతు ఇస్తానన్నాడు."

"అతనిస్తానన్న వాటాలో మా ఇద్దరికీ రెండు వంతులు ఇవ్వాలి" చెప్పింది స్వప్న.

"అలాగే!" అన్నాడు క్రిస్టోఫర్.

"ఆ కాగితాల్లో అన్ని వివరాలున్నాయి. ఏ ఇల్లు ఎలా దోచుకోవాలో మీ అనుభవంతో ఆలోచించి పథకం తయారు చెయ్యండి. ఆ తర్వాత మనం కూర్చుని చర్చించుకుందాం. ఏవైనా లోపాలుంటే సర్దుకుందాం."

"నీ బాయ్ ఫ్రెండ్ కున్న స్పెషల్ క్వాలిఫికేషన్ను చెప్పలేదు!"

"ఎలాంటి తాళాలైనా సునాయాసంగా తియ్య

కలదు. వెయ్యగలదు. సింహం నోట్లోనైనా వెనకా ముందూ చూడకుండా చెయ్యిపెట్టగలదు'' అంది స్వప్న గర్వంగా.

"అవసరమైతే హత్యలు చెయ్యగలదా?"

"చెయ్యగలదు. కాని నేను ఒప్పుకోను. నాకు నచ్చదు. అలాంటి అవాంతరమేదన్నా వస్తే మీరు చూసుకోవలసిందే" చెప్పింది నిర్మొహమాటంగా.

"రైటో! అలాంటి అవసరం రాదు!"

"అయితే నేను వెళ్తాను. మనం మళ్ళీ ఎప్పుడు కలుసుకునేది తర్వాత నిర్ణయించుకుందాం. ఇక్కడకు మాత్రం ఇంక రాను" అంది స్వప్న.

"నీ ఇష్టం! నువ్వు ఈ ప్రయత్నాలు చేస్తున్నట్లు తారాచంద్‌కు తెలుసా?"

"తెలీదు! అతనితో జాగ్రత్తగా వ్యవహరించాలి. నువ్వే అతన్ని హాండిల్ చెయ్యాలి. ఇచ్చినమాట నిలబెట్టుకోవడం అతనికి అలవాటులేదు. నాకు తెలిసి నలుగుర్ని మోసంచేశాడు. ఇంత కష్టపడి మనం అతనికి సరుకంతా అందిచాక మొండిచెయ్యి చూపిస్తే..."

"వాడి గుండెకాయ కోస్తాను. అతన్ని గురించి నువ్వేం కంగారు పడొద్దు. నాకోమారు నీ బాయ్ ఫ్రెండ్‌ను చూపించు."

"ఇప్పుడు వాటాలన్నీ కుదిరాయిగా! చూపిస్తాను" అంది స్వప్న లేస్తూ.

"అతనికి డబ్బేమన్నా కావాలా?" అడిగాడు క్రిస్టోఫర్.

"నీ దగ్గరుందా?"

"ఎంత కావాలి?"

"ఒక వెయ్యి రూపాయలివ్వు."

కోటు జేబులోంచి కాగితాల కట్టతీసి పదికాగితాలు లెఖపెట్టి లాగాడు. వాట్ని స్వప్నకు అందించాడు. ఆమె తీసుకొని హాండ్ బ్యాగ్ లో పెట్టుకొంది.

"నేను వెళ్తాను!" అంది.

"గుడ్!" అన్నాడు క్రిస్టోఫర్.

స్వప్న వెలుపలకొచ్చింది.

4

కారు ఓషియానిక్ గేటు దాటి బీచ్ రోడ్ ఎక్కింది.

పింక్ కలర్ చీరకట్టుకొని అదే రంగు జాకెట్ వేసు కుంది బేబీ. మెళ్ళో పింక్ కలర్ లావుపాటి పూసల దండ తగిలించుకొంది. కళ్ళకు పింక్ కలర్ గ్లాసెస్ పెట్టు కొంది.

"మిస్టర్ అశోక్!" పిలిచింది బేబీ.

"యస్ మేడమ్!" అన్నాడు అశోక్.

"అలా పిలవొద్దు! బేబీ అను! నాకు బాగుంటుంది."

"మీరు నా బాస్. అలా పిలవటం బాగుంటుందా?"

"బాగుంటుందనే చెప్పాను. నాకు చాలా ఆకలిగా వుంది. మంచి హోటల్ కు పోనీ సుష్టుగా తిందాం" అంది బేబీ.

"ఎస్కిమోకు వెళ్దామా!" అడిగాడు.

"ఊఁ!" అంది బేబీ.

కారు ఎస్కిమో ముందాగింది. ఇద్దరూ దిగి లోనికి నడిచారు. ఫ్యామిలీ రూమ్ వైపు దారి తీసింది బేబీ. లోనికి వెళ్ళారు. బాయ్ రాగానే మెనూకార్డు తీసుకుని పెన్సిల్ తో గుర్తులు పెట్టి పంపింది.

డిప్లొమాట్ విస్కీ, సోడాసీసాలు తెచ్చిపెట్టాడు

బాయ్. బేబీ బాటిల్ ఓపెన్ చేసి రెండు గ్లాసుల్లో పోసింది.

ఇద్దరు త్రాగడం మొదలెట్టారు.

"మిస్టర్ అశోక్! మీ వయస్సెంత?" అడిగింది బేబీ.

"ముప్ఫయి మూడేళ్ళు."

"ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?"

"ఆరు నెలల ముందుదాకా సరయిన ఉద్యోగమే లేదు. ఇప్పుడు నెలకు వెయ్యి రూపాయలొస్తున్నాయి. అయినా ఈ జీతంతో భార్యను సుఖపెట్టగలనన్న నమ్మకం లేదు. అందుకే ఆ విషయం గురించి ఆలోచించడం మానుకున్నాను" అన్నాడు అశోక్.

"ఐ. సీ. ఎంత జీతమొస్తే పెళ్ళాడాలనుకుంటున్నారు?"

"కనీసం నెలకు రెండు వేలన్నా రానిదే పెళ్ళి గురించి ఆలోచించదలచుకోలేదు."

"బాచ్‌లర్‌గా లైఫ్ ఎలా వుంది?"

"బాగానే వుంది."

"ఐమీన్......" అంటూ నవ్వింది.

ఆమె నవ్వు అర్థం చేసుకున్నాడు అశోక్. ఆమెతో తనకు చాలామంది గరల్ ఫ్రెండ్స్ున్నారని చెప్పడం ఇష్టంలేకపోయింది. అదోక అవలక్షణంగా భావించి ఉద్యోగంలోంచి ఊడబీకితే మళ్ళీ వీధిన పడాల్సి వస్తుందన్న భయం కలిగింది.

"నాపైన నాకు కంట్రోలుంది" అన్నాడు నవ్వుతూనే.

బాయ్ రకరకాల కూరలు తెచ్చిపెట్టాడు టేబిల్

పైన. వాడు తెచ్చిన మొత్తం ప్లేట్లు పెట్టేందుకు ఆ టేబిల్ చాలలేదు.

"ఎందుకండీ చాలా ఆర్డరు చేశారు?" అన్నాడు అశోక్.

"మీకు మంచి డిన్నరివ్వాలనిపించింది. తినండి" అంది తనూ ప్రారంభిస్తూ విస్కీ తాగుతూ, భోజనం ప్రారంభించారు.

గంట రెండయింది.

"మనం ఇక్కడికి కొచ్చి మూడుగంటలయింది" అన్నాడు అశోక్.

"మీకేమన్నా అర్జంటు పనులున్నాయా?"

"అబ్బే! లేవండీ" అన్నాడు.

"అయితే ఎందుకలా కంగారుపడతారు" అంటూ ఆఖరిసిప్ తాగింది.

ఆమె తాగుతూనే తినింది. దయ్యపు తిండి ఆమె దనుకున్నాడు అశోక్.

బాయ్ బిల్లు తెచ్చాడు. చూచి గుడ్లప్పగించాడు. మూడొందలా ఇరవై రూపాయలయింది. పర్సు తీసి చూశాడు. అందులో రెండొందలా రెండు రూపాయలున్నాయి. ఆ బిల్లు చెల్లించడమెలాగా అని మీమాంస పడసాగాడు.

బేబీ పర్సు తెరచి వందరూపాయల నోట్లకట్ట వెలుపలికి లాగి అందులోంచి నాలుగు కాగితాలు వేరుచేసి లాగి, ప్లేట్లో పడేసింది.

"నే నిస్తాలెండి!" అన్నాడు అశోక్.

"మీ జీతం నెలకు వెయ్యి రూపాయలే! నాలాంటి వాళ్ళతో రెండుసార్లు హోటల్‌కు వస్తే నెలంతా పస్తుం

డాల్సిందే. మీకు డిన్నరివ్వాలని నేను పిల్చుకొచ్చాను" అంది బేబీ.

అశోక్ అంతటితో నోరు మూసుకున్నాడు. బాయ్ చిల్లర తెచ్చాడు. వాడికి ఇరవై రూపాయలు వదిలేసి మిగిలిన డబ్బు తీసుకుని లేచింది బేబీ.

ఇద్దరూ వెలుపలికొచ్చి కారెక్కారు.

"ఆఫీసుకు వెళ్దామా?" అడిగాడు అశోక్.

"వద్దు!" అంది బేబీ.

"మరి హోటల్ కు పోనిచ్చేదా?"

"వద్దు! తిన్నగా ఇలియట్స్ బీచ్ కు పోనివ్వండి. మీతో కొద్దిగా మాట్లాడాలి" అంది.

"అలాగే!" అంటూ కారును అడయారు వేపు మళ్ళించాడు.

మధ్యాహ్నం వేళ కావటంతో బీచ్ అంతా నిర్మానుష్యంగా వుంది. కారు దిగి ఇద్దరూ సముద్రం అంచుకు నడిచారు.

"బొంబాయికన్నా బీచ్ ఇక్కడ బాగుంటుంది" అంది బేబీ నడుస్తూనే.

"నేను బొంబాయి చూడలేదు!" చెప్పాడు అశోక్.

"ఏమిటి మీరు సరదాగా వుండలేక పోతున్నట్లుంది. నాతో తిరగటం మీకు కష్టంగా వుందా?" అతని కళ్ళలోకి చూస్తూ అడిగింది బేబీ.

"నో! నో! అలాంటిదేమీ లేదు. మీ కంపెనీ చాలా బాగుంది" అన్నాడు ఆమె బాస్ కూతురన్న విషయం మరచిపోలేక.

"మా ఫాదరని చూశారుగా! ఆయన ఏదీ పట్టించుకోడు. వ్యాపారం గూడా ఎప్పుడో చాలా సంవత్స

రాం క్రితం హుషారుగా చేశాడు తప్ప, ఇప్పుడు దాని పైన ఇంట్రస్టు లేదు.''

''మొదట్లోనే కష్టం. అంతా ఆర్గనైజ్ అయ్యాక చేసేందుకేముంటుంది. కళ్లు మూసుకుని కూర్చున్నా జరిగి పోతుంటుంది.''

''వ్యాపారమైతే జరుగుతుంది. మరి నా పెళ్ళి జరుగుతుందా?'' అడిగింది రకన్న.

''ఎందుకు జరుగదు! కోట్లు ఖరీదు చేసే ఆస్తికి ఏకైక వారసురాలయారు. మిమ్మల్ని చేసుకునేందుకు వెనుకాడే వాడెవరన్నా వుంటే వాడు వెధవే!'' అన్నాడు ఆమెను పొగడుతున్నట్లు.

''మిమ్మల్ని నేను ఒకందుకు పిల్చుకొచ్చాను. నాకు మీరో చిన్న సాయం చెయ్యాలి. చేస్తానని మాటిస్తే చెప్తాను'' అంది బేబీ.

వాళ్ళకు దరిదాపుల్లో ఎవ్వరూ లేరు.

''చెప్పండి! చేస్తాను.''

''ఇప్పుడు ఇక్కడే నన్ను మీరు అనుభవించాలి.''

''మేడమ్!'' ఆశ్చర్యపోతూ అన్నాడు.

''నో! బేబీ!''

''మీరు పెళ్ళికావలసినవారు, పైగా నా బాస్.''

''అని భయపడవలసింది నేను. మీరుగాదు. పోనీ నన్ను అనుభవించడం మీకు ఇష్టంలేదని చెప్పండి. నేను ఆడదాన్ని కాదని చెప్పండి వెళ్ళిపోతాను'' అంది. ఆమె కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

అశోక్‌కు పరిస్థితి అర్థమయింది. ఆమె కన్నీళ్లు తుడిచి పొదవి పట్టుకొన్నాడు. ఘట్టిగా గుండెలకు హత్తుకున్నాడు. ఆమె ఆడతనం తన గుండెలపైన రాచుకో

లేదు. క్షణకాలం నిరుత్సాహం తొంగిచూసింది. వెంటనే తన్ను తనే తమాయించుకున్నాడు.

అరగంట తర్వాత బేబీ లేచి బట్టలు కట్టుకుంది. అశోక్‌ను తన వొడిలో పడుకోబెట్టుకుంది.

"హౌడూయూ ఫీల్!" అడిగింది.

"వండర్‌ఫుల్" అన్నాడు.

"నువ్వింతకు ముందు ఎవరినన్నా అనుభవించావా?"

"ఆఁ!"

"నాతోటి అనుభవం ఎలావుంది దాంతో పోలిస్తే!"

"బాగుంది. ఐ లైక్ ఇట్!"

ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఎందుకలా బాధపడుతున్నారు" అడిగాడు అశోక్.

"నేనొకతన్ని ప్రేమించాను, పిచ్చిగా వెంటబడ్డాను. అతను నన్ను నిరాకరించాడు. ఎందుకో తెలుసా! నాలో ఆడతనంకన్నా మగతనం ఎక్కువగా వుందట. అది నిజమా!" అడిగింది బేబీ ఏడుస్తూ.

"కాదు! మీరు చాలా ఎమోషనల్ మనిషి అంతే!" అన్నాడు అశోక్.

"థాంక్స్! పదండి వెళ్దాం" అంది బేబీ.

ఇద్దరూ వచ్చి కారెక్కారు. కారు హోటల్ ఓపియానిక్ వెళ్ళింది. బాస్ తన్నేమీ అడగలేదు. వాళ్ళ దగ్గర శెలవు తీసుకుని ఇంటికి వెళ్ళాడు.

5

"మనకొక్కు బలసిన ఆరుగురిలో ఇద్దరు ఇళ్ళకు తాళాలు వేసి ఊరికి వెళ్ళినట్లు తెలిసింది. ముందుగా మన పనికి ప్రారంభోత్సవం అక్కడే జరగాలి!"

చెప్పాడు క్రిస్టోఫర్ సిగరెట్ బట్ చేస్తూ.

"ఎవరా ఇద్దరు?" అడిగాడు జాన్.

"ఒకరు డాక్టరు జార్జి. మరొకరు శమంతకమణి. జార్జి ఇల్లు జార్జిటౌన్‌లో వుంది. ఆరంతస్తుల భవనంలో, మూడో అంతస్తు మొత్తం అతనిదే. కాపలా వాళ్ళెవరూ లేరు. శమంతకమణి బంగళాలో మాత్రం ఔట్ హౌస్‌లో పని వాళ్ళున్నారు. రోజూ ఇల్లు తాళంతీసి శుభ్రంచేసి, మళ్ళీ తాళం పెడుతున్నారు. ఆమె ఇల్లు హబిబుల్లా రోడ్‌లో వుంది" చెప్పింది స్వప్న.

క్రిస్టోఫర్ రెండు డ్రాయింగులుతీసి టేబుల్ పైన పరచాడు.

అవి ఆ ఇళ్ళ ప్లాన్లు. వాటిల్లో ఏ గదిలో ఐరన్ సేఫ్ లున్నదీ, ఎన్ని ద్వారాలు దాటవలసిందీ మార్క్ చేసి వుంచాడు. వాట్ని జాన్ ముందుకు నెట్టాడు.

జాన్ పరిశీలనగా చూశాడు.

"లోపలికి వెళ్ళడం, రావడం పెద్ద సమస్యగాదు! ఆ ఐరన్ సేఫ్‌లు తెరవటం కష్టం. అవి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన లైన్ కంపెనీవి. ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా, పొరపాటు చేసినా పోలీసుల చేతుల్లో పడతాం!" అన్నాడు జాన్.

"ఎందుకని?"

"వాటికి ఎలక్ట్రానిక్ కంట్రోల్సున్నాయి. అవి తెరవటం తాళాలతో గాదు! రెండు స్విచ్‌లు అమర్చివుంటాయి. వాట్నికూడా ఎక్కడో అమరుస్తారు. ఒకదాని బదులు మరొకటి నొక్కితే, తిన్నగా పోలీస్ కంట్రోలు రూంలో ఏర్పాటు చెయ్యబడ్డ బర్గిలరీ బజర్ మ్రోగుతుంది. వెంటనే వాళ్ళు వచ్చేస్తారు" అన్నాడు జాన్.

"నీకెలా తెలుసు ఈ విషయం."

"ఎనిమిది సంవత్సరాల క్రితం నేను బొంబాయిలోని

లైన్ కంపెనీ హెడ్ ఆఫీసులో పనిచేశాను. నా చేతి మీదుగా చాలామంది ఇళ్ళల్లో వాట్ని అమర్చాను. ఆ కంట్రోల్సు వివరాలు ఆ ఇంటి యజమానికీ, కంపెనీకి తప్ప మరెవ్వరికీ తెలిసే అవకాశంలేదు. అందువల్లే ఆ కంపెనీ ఆ సేఫ్‌లు చాలా ఎక్కువ ఖరీదుకు అమ్ముతుంది" అన్నాడు జాన్.

"వాటి విషయం నీకు పూర్తిగా తెలిశాక భయమేముంది."

"తెలిసేందుకేమీ లేదు. ఒక్కొక్క సేఫ్ కంట్రోల్సు విడివిడిగా వుంటాయి. అవి ఎక్కడ అమర్చబడివున్నాయో తెలుసుకోవాలి. అది తెలుసుకోకుండా దొంగతనానికి పోవడం, మనకు మనమే పోలీసుల వలలోకి నడచి వెళ్ళడమవుతుంది" అన్నాడు జాన్.

"అయితే ఏంచేద్దాం!" అడిగింది స్వప్న.

"వీటికి కరెంటు కనెక్షనుంటుంది. దాని ద్వారానే అలారం పనిచేస్తుంది. మనం ముందు కరెంటు లేకుండా చేస్తే, అరగంట తంటాలుపడి సేఫ్ తెరవచ్చు. కానీ యియ్యడం సాధ్యంగాదు" అన్నాడు జాన్.

"అదంత మంచి పథకంకాదు. అరగంటసేపు ఆ ఇంట్లో వుండటం ప్రమాదాలకు దారితీయొచ్చు. వాటి కంట్రోలు స్విచ్‌లు ఎక్కడుందేది కనుక్కోవడమే మంచిదనిపిస్తుంది!" క్రిస్టోఫర్ తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

"నాకూ అదే మంచిదనిపిస్తూంది!" అంది స్వప్న.

"ఇక్కడ కంపెనీ ఆఫీసులో మనం ఎవరినైనా లోబరుచుకో గలిగితే వాటి రహస్యాలు సంపాదించవచ్చు. ప్రతి కష్టమరుకు అమర్చిన సేఫ్ తాలూకు ప్లాను ఆఫీసులో వుంటుంది. వాట్ని చేజిక్కించుకుంటే వ్యవహారం

ఫైసలవుతుంది" జాన్ అన్నాడు.

"ఆ విషయం నాకు వదిలెయ్యండి! నేనెలాగో తంటాలు పడతాను. ఎల్లుండి రాత్రికి మొదటి దొంగతనం చేద్దాం! ఈలోగా నేను నీకొక్క వలసిన వివరాలు పట్టుకొస్తాను. మన మీటింగ్ ప్లేస్ ఇదే! ఎల్లుండికూడా ఇక్కడికే రండి" అన్నాడు క్రిస్టోఫర్.

"అలాగే" అన్నారు స్వప్న, జాన్ లు.

క్రిస్టోఫర్ అక్కడ్నుంచి బయలుదేరి వెలుపలికొచ్చాడు. టాక్సీ ఎక్కి తిన్నగా "లైన్ సేఫ్ కంపెనీకి" పోనిమ్మన్నాడు.

టాక్సీ మౌంట్ రోడ్ కేసి దౌడు తీసింది.

లైన్ సేఫ్ కంపెనీ ముందాగింది టాక్సీ. క్రిస్టోఫర్ టాక్సీని వెయిటింగ్ లోనే వుంచి లోనికి వెళ్ళాడు.

మేనేజర్ అని వున్న రూం తలుపు తోసుకుని వెళ్ళాడు. క్రిస్టోఫర్ ను చూడగానే మేనేజర్ లేచి కూర్చోమని సంజ్ఞ చేశాడు. ఇద్దరూ కూర్చున్నారు.

"నా బంగళాలో మీ కంపెనీ సేఫ్ ఫిక్స్ చేయించాలనుకుంటున్నాను" అన్నాడు క్రిస్టోఫర్ సిగరెట్ అంటిస్తూ.

"ష్యూర్! అలాగే. మీ యింటి అడ్రసు రాసివ్వండి. మా ప్లానింగ్ వింగ్ వాళ్ళు వచ్చి చూసి ప్లాన్ తయారు చేస్తారు. ఆ తర్వాత మీకు చూపిస్తారు. మీరు సరే నంటే పని ప్రారంభం చేస్తారు" అన్నాడు మేనేజర్.

"అదంతా లాంగ్ ప్రోసెస్. నాకు రేపుసాయంత్రం కల్లా కావాలి. నేను చాలా ఖరీదైన నగలు కొన్నాను. రేపు డెలివరీ చేస్తారు. వాట్ని భద్రం చేసుకోవాలి" అన్నాడు క్రిస్టోఫర్.

"ఐ. సీ. మామూలుగా మాకు నెలరోజులు పడుతుంది."

"అయితే లాభం లేదు."

"పోనీ మా పని అయ్యేదాకా మీ నగలు బ్యాంక్ లో పెట్టండి."

"అది నాకిష్టం లేదు. బ్లాక్ మనీతో కొంటున్నా నీ నగలు. బ్యాంక్ లో పెడితే ఎవరన్నా ఆరా తీయొచ్చు-ఇన్ కంటాక్స్, వెల్త్ టాక్స్ వాళ్ళు రైడ్ చెయ్యొచ్చు. అది చాలా ప్రమాదం."

"ఐ అండర్ స్టాండ్! అయితే ఎలా చేద్దాం!"

"ఈ వూళ్ళో ఇంతకు ముందెవ్వరికీ మీరు సేఫ్ లు అమ్మలేదా?"

"ఎందుకు లేదు! దాదాపు వందమందికి పైగానే కొన్నారు."

"మీదగ్గిర వాళ్ళ తాలూకు ప్లాన్సు వుంటే చూపించండి. ఏదో ఒకటి సెలెక్ట్ చేసుకుంటాను. దాని ప్రకారం ఫిక్స్ చేద్దురుగాని!" అన్నాడు క్రిస్టోఫర్.

"సారీ! అలా చూపడం మా కంపెనీ పద్ధతికి వ్యతిరేకం. ఒకరి ప్లాన్ మరొకరికి తెలియకుండా వుంచడంలోనే మా బిజినెస్ గొప్పతనం వుంది."

"మీ ప్రిన్సిపల్ నా కర్థమవుతూంది. నా డిఫికల్టీ కూడా మీరు ఆలోచించండి.

"మీ కంపెనీ వెతుక్కుంటూ వచ్చిన కష్టమర్ ని. ఏదో విధంగా తృప్తి పరచడంకూడా మీ ధర్మమే! నాకెలాగైనా మీరు సాయం చేయాలి" అన్నాడు క్రిస్టోఫర్.

"పర్సనల్ గా మీకు సాయం చెయ్యాలని వుంది. కానీ..రూల్స్ నతిక్రమించడం నాకంత మంచిదిగాదు;

రేపేదైనా జరిగితే మొత్తం నామీద చుట్టుకుంటుంది."

"నేనేం దొంగను కాను. ఆలోచించండి."

మేనేజర్ ఆలోచనలో పడ్డాడు.

టేబుల్ పైనున్న ఇంటర్ కమ్ మ్రోగింది. అతను రెండు నిముషాలు మాట్లాడి—

"మా జనరల్ మేనేజరుగారు పిలుస్తున్నారు, వెళ్ళి ఇప్పుడే వస్తాను. ఆయనతోగూడా సంప్రదిస్తాను" అన్నాడు మేనేజర్.

"వద్దు! ఈ విషయం మనిద్దరి మధ్య వుంచండి. మీ సాయం వృధాపోదు" అంటూ వెయ్యిరూపాయలు తీసి టేబుల్ పైన పెట్టాడు.

మేనేజర్ వాటికేసి చూసి, తక్కున లాక్కుని జేబులో పెట్టుకొని వెళ్ళిపోయాడు.

క్రిస్టోఫర్ ఆనందంగా ఈలవేశాడు. అతను ప్లాను చూపించగానే తనకావలసినవాళ్ళ ప్లానుల్లో స్విచ్ లు ఎక్కడున్నదీ గుర్తుపెట్టుకోవాలి. తను ఏకసంథగ్రాహి. అదేం పెద్ద కష్టమైన విషయం గాదు.

మేనేజర్ తిరిగివచ్చాడు గదిలోకి. లావుపాటి రికార్డు బుక్ తెచ్చి అందించాడు క్రిస్టోఫర్ కు.

"త్వరగా చూడండి!" అన్నాడు.

క్రిస్టోఫర్ తన పనిలో నిమగ్నమయినాడు. మేనేజర్ ఏదో పెద్ద స్టేట్ మెంట్ ముందు పెట్టుకుని కూడ సాగాడు.

మళ్ళీ ఇంటర్ కమ్ మ్రోగింది. లేచి వెళ్ళాడు.

క్రిస్టోఫర్ తక్కున రెండు ప్లాన్లు చింపి, మడతచుట్టి కోటుజేబులో పెట్టుకున్నాడు.

మేనేజర్ తిరిగొచ్చాడు.

"సెలక్ట్ చేశారా?" అడిగాడు.

"ఆc!" అంటూ పుస్తకం ముందుకు పెట్టి "ఆ ఏడో నెంబరు ప్లానులా ఫిక్స్ చేయించండి" అన్నాడు.

"మా ఫిట్టర్‌ను రేపు పంపేదా?"

"పంపండి. అడ్వాన్సు ఇస్తాను. అడ్రసుకూడా రాసి స్తాను" అంటూ కాగితంపైన అడ్రసు రాసి వెయ్యి రూపాయలు అడ్వాన్సు ఇచ్చి, మేనేజర్ దగ్గర శెలవు తీసుకుని వెలుపలికొచ్చి వెయిటింగ్‌లో నున్న టాక్సీ ఎక్కి తిన్నగా ఎవరెస్ట్ హౌస్‌కి పోనివ్వమన్నాడు.

టాక్సీ బయలుదేరింది.

క్రిస్టోఫర్‌కు నవ్వొచ్చింది. రేపు ఆ అడ్రసుకు వెళ్ళిన ఫిట్టర్ బిక్కమొహం వేస్తాడు. అది రాజేశ్వరీ కల్యాణ మండపం అడ్రసు. మేనేజర్‌కు తన్నెవరో మోసం చేశారన్నది తెలుస్తుంది. కానీ అంచం తీసుకున్నాడు కాబట్టి నోరుమూసుకుని కూచుంటాడు తప్ప, వేరే గొడవ చెయ్యడన్న ధైర్యం కలిగింది.

టాక్సీ ఎవరెస్ట్ హౌస్ ముందాగింది. డబ్బిచ్చి లోనికి నడిచాడు క్రిస్టోఫర్.

6

"మిస్టర్ అశోక్! నేను జీవితమంతా కష్టపడి సంపాదించిన ఆస్తి విలువ ఎంతో తెలుసా?" అడిగాడు బాస్.

"తెలీదు సార్!" అన్నాడు అశోక్.

"ఆరు కోట్లు. ఆ డబ్బు నా తదనంతరం బేబీకి వస్తుంది. బేబీని పెళ్ళాడేవాడెవరైనా క్షణంలో కోటీశ్వరుడవుతాడు."

"అవును సార్!"

"బేబీని పెళ్ళిచేసుకోమని ఎన్నోసార్లు చెప్పాను. ఎన్నో సంబంధాలు తెచ్చాను. ఆమెకి ఎవ్వరూ నచ్చ

లేదు. ఇంతదాకా పెళ్ళిచేసుకోలేదు. నేను చచ్చే లోపల ఆమెకు పెళ్ళి కాదేమోనన్న భయం నన్ను పట్టుకుని పీడిస్తూనే వుండింది. ఈ ట్రిప్‌లో అదికాస్తా పోయింది."

"ఇక్కడేదైనా సంబంధం చూశారా?"

"లేదు! తనే చూసుకుంది."

"ఎవరుసార్ పిల్లాడు. అతని కెన్నికోట్లకుంది ఆస్తి!"

"తొడుక్కోడాను కోటులేదు. నెలకు వెయ్యిరూపాయల జీతం వస్తుందట."

"ఎవరుసార్ అతను?"

"నీకింకా అర్థంకాలేదా? నువ్వే అతను."

"నేనా! వేళాకోళ మాడుతున్నారు. మీ దగ్గర ఉద్యోగం చేసుకుని బ్రతికే వాణ్ణి" అన్నాడు అశోక్.

"నువ్వెవరివైనా నాకనవసరం. అమ్మాయి ఇష్టపడ్డాక వాడు దారినపోయే దానయ్యయినాసరే ఇచ్చి కట్టబెడతాను. నీకు చేసుకోవడం ఇష్టంలేదా? ఆరుకోట్ల రూపాయలకు అధికారిణి మా బేబీ. నిన్ను ప్రేమించింది. పెళ్ళాడతా నంటోంది. కాళ్ళదగ్గర కొచ్చిన లక్ష్మిని కాలదన్నుకోకు" చెప్పాడు బాస్.

అశోక్ ఆలోచనలో పడ్డాడు. ఆస్తి, అంతస్తు తనకేం చేదుగాదు. కానీ బేబీని తలచుకుంటే భయం పుట్టింది. ఆమె కామపిశాచి. ఆమె డబ్బు మీద ఆశ వున్నా, ఆమెతో జీవితం నరకప్రాయమన్న నిర్ణయానికొచ్చాడు.

"క్షమించండి! నాకు ఇలాగే బ్రతకటం ఇష్టం. బేబీకి మంచిసంబంధం చూడండి. నన్ను వదిలెయ్యండి" అన్నాడు అశోక్.

అప్పుడే గదిలో కొచ్చింది బేబీ.

"ఆయన ఏమంటున్నారు డాడీ!" అడిగింది.

అశోక్ చెప్పింది చెప్పాడు బాస్. వినింది బేబీ.

"అయితే నిన్న నువ్వు చెప్పింది అబద్ధం కదూ! నీ బాస్ కూతుర్నని నన్ను ఆకాశాని కెత్తేశావు. అంతేనా!"

"కాదు!" అన్నాడు అశోక్.

"కాకుంటే ఎందుకు పెళ్ళాడడానికి భయపడుతున్నావు. నేను నీకు నిజాయితీ గల భార్యగా వుండగలను. నా ఆస్తి అంతస్తు గురించి ఆలోచించకు" అంది బేబీ.

"నన్ను ఆలోచించుకో నివ్వండి" అన్నాడు అశోక్.

"అలాగే! నువ్వు నా డబ్బుతో బ్రతకవలసిన అవసరం లేదు. నువ్వు జనరల్ మానేజర్ గానే వుండు. నీ జీతం పెంచుతాను. నెలకు పదివేలు జీతం ఇస్తాను. ఆ డబ్బు నీ ఇష్టమొచ్చినట్లు ఖర్చుపెట్టుకో! సరేనా!" అన్నాడు బాస్.

అశోక్ కాసేపు మథనపడ్డాడు.

"అలాగే!" అన్నాడు అశోక్.

"గుడ్ బాయ్!" అన్నాడు బాస్.

బేబీ గర్వంగా నవ్వింది.

"అమ్మాయిని తీసుకొని పో! మీకు కావలసిన బట్టలు, నగలు అన్నీ కొనుక్కోండి. పెళ్ళికి ఏర్పాట్లు చేస్తాను. ఎవ్వరూ, ఎన్నడూ చేయని విధంగా చేస్తాను ఈ పెళ్ళి!" అన్నాడు ఆవేశంగా బాస్.

"ఆ ఆడంబరాలు నాకు పనికిరావు. సింపుల్ గా జరగడం బాగుంటుంది. ఇక్కడే రిజిస్ట్రాఫీసులో కాని చేద్దాం. ఫ్రెండ్స్ ను పిలిచి పార్టీ ఇద్దాం. అంతే!" అన్నాడు అశోక్.

"అలాగే కానీండి నాన్నా!" అంది బేబీ.

ఆ తర్వాత ఇద్దరూ కారెక్కారు.

"అశోక్! నాపైన ఇష్టంలేదా నీకు!" అడిగింది.

"ఇష్టంలేక కాదు. నేను తగిన భర్తను కానేమోనని అనుమానమేసింది. అదీగాక నేను ఇంతకుముందు చాలా మంది ఆడవాళ్ళతో సంబంధం పెట్టుకున్నాను. నిన్ను మోసం చెయ్యడం ఇష్టంలేక అలా అన్నాను" అన్నాడు అశోక్.

"పెళ్ళికిముందు జరిగిన వాటిన్నిగురించి, నువ్వూ, నేనూ మరచిపోదాం! ఇకపైన ఒకరికొకరం నీతిగా నిజాయితీగా వుందాం. అంతవరకు చాలు!" అంది బేబీ.

"అలాగే!" అన్నాడు అశోక్.

కారు చెల్లారామ్స్ షాపు ముందాపి లోనికెళ్ళారు. రెండుగంటలసేపు బట్టలు ఏరికోరి కొన్నారు. బిల్లు పది వేలయింది. బేబీ చెక్ రాసిచ్చింది. పాకెట్లు తెచ్చి డిక్కీలో పెట్టాడు బాయ్.

ఇద్దరూ అక్కడ్నుంచి ఎమరాల్డ్ హౌస్కి వెళ్ళారు. ఖరీదైన రత్నాల నెక్లెస్ కావాలంది బేబీ. మానేజర్ ఆరో అంతస్తులో వున్న తారాచంద్ దగ్గరకు తీసుకెళ్ళాడు. తారాచంద్ ఇద్దర్నీ కూర్చోబెట్టి తనదగ్గరున్న నెక్లెసులు చూపించాడు. బేబీకి నచ్చలేదు. పైగా వాటి ఖరీదుకూడా అంత ఎక్కువగాలేదు.

"సంవత్సరం క్రితం పేపర్లో చదివాను. విలువైన రత్నాలతో పొదిగిన నెక్లెస్ ఒకటి సినిమాతార శమంతక మణి కొన్నట్టు. మీదగ్గరేనా?" అడిగింది బేబీ.

"అవునండీ!"

"దాని ఖరీదెంత?"

"అప్పట్లో ఐదులక్షలకు అమ్మాను. ఇప్పుడైతే ఏడు లక్షలదాకా అవుతుంది," చెప్పాడు తారాచంద్.

"నా కలాంటి రత్నాల నెక్లెస్ కావాలి! మీ దగ్గర ఆ

రకం రత్నాలున్నాయా?" అడిగింది బేబీ.

"ప్రస్తుతం లేవు. మీకు కావాలంటే ఢిల్లీనుండి తెప్పిస్తాను. ఎల్లుండి సాయంత్రానికల్లా ఇవ్వగలుగుతాను" అన్నాడు తారాచంద్.

నెక్లెసుల డిజైన్ల బుక్ తీసి పరిశీలనగా చూసి, ఒక మోడల్ సెలెక్టు చేసి, "ఈ రకం మోడల్ నెక్లెసు తయారుచేసి ఇవ్వండి," అంది బేబీ. అశోక్ కూడా దాన్నే లైక్ చేశాడు.

"అలాగే!" అన్నాడు తారాచంద్.

"అడ్వాన్సుగా లక్షరూపాయలకు చెక్కిస్తాను" అంటూ పర్సులోంచి చెక్ బుక్ తీసి గబగబ రాసి సంతకం చేసి, చించి ఇచ్చింది.

తారాచంద్ బెల్ కొట్టాడు.

మిస్ స్వప్న లోనికొచ్చింది.

"అమ్మగారికి రశీదు టైప్ చేసి పట్టుకురా!" అన్నాడు తారాచంద్.

"మిస్టర్ అశోక్!" అంది స్వప్న.

"నువ్వా! ఇక్కడేనా పనిచేసేది" అడిగాడు అశోక్. అతడికి మిస్ స్వప్నతో అదివరకే పరిచయముంది.

"రశీదు త్వరగా పట్టుకురండి!" అంది బేబీ, అశోక్ ఆమెతో మాట్లాడటం ఇష్టంలేక.

"ఇప్పుడే తెస్తాను" అంటూ లోనికి పరిగెత్తింది స్వప్న.

బేబీ తండ్రి గురించి తెలుసుకొని తారాచంద్ నోరు వెళ్ళబెట్టాడు. వాళ్ళకాతా తనకు చిక్కనందుకు లోలోపలే సంతోషపడ్డాడు. అతనికి ఆత్రుతగా వుంది. వాళ్ళు వెళ్ళగానే తను క్రిస్టోఫర్ను కలుసుకోవాలి. అతన్నా

పని పూర్తి చెయ్యమని చెప్పాలి. అతను తేస్తే తప్ప బేబీ కిచ్చిన మాట నిలబెట్టుకోవడం సాధ్యంకాదు.

డబ్బు తీసుకొని వెళ్ళాక క్రిస్టోఫర్ తనదగ్గరకు రానే లేదు. అతనికోసం రోజూ ఎదురు చూస్తూనే వున్నాడు.

స్వప్న రశీదు తెచ్చింది. తారాచంద్ సంతకంచేసి ఇచ్చాడు. బేబీ లేచింది.

"ఎల్లుండి వస్తాం!" అన్నాడు అశోక్.

"వచ్చేముందు ఫోన్ చెయ్యండి. ఏదైనా ఆలస్య ముంటే మీకు చెపుతాను" అన్నాడు తారాచంద్.

"ఆలస్యం కావడానికిలేదు. ఆ రోజ్ మా మారేజ్ జరుగుతుంది. రాత్రికి పార్టీవుంది. పార్టీకి నేనా నెక్లెసు పెట్టుకోవాలి" అంది బేబీ.

"ఆలస్యమంటే రోజులు కాదు. గంటలు. మీకు పార్టీకి దాన్ని అందించే పూచీ నాది" అన్నాడు తారా చంద్.

"థాంక్స్! వస్తాను!" అన్నాడు అశోక్.

బేబీగూడా వెంట నడిచింది. వాళ్లో కూర్చుని టైప్ చేస్తున్న స్వప్న అశోక్ కేసి చూడటం బేబీ గమనించింది. అతన్నటు చూడనీకుండా ఏదో కల్పించుకొని మాట్లా డుతూ చెయ్యిపట్టుకుని క్రిందకు మెట్లమీదుగా నడిపించుకు పోయింది.

వాళ్ళు వెళ్ళిపోగానే సేఠ్ తారాచంద్ హోటల్ పారడైజ్ కు ఫోన్ చేసి, క్రిస్టోఫర్ ను వెంటనే వచ్చి కలుసుకోమన్నాడు.

7

రిజస్ట్రాఫీసులో పెళ్ళి తతంగం ముగించుకొన్నారు.

అశోక్, బేబీ, బాస్ ముగ్గురూ కార్లో హోటల్ కు బయలుదేరారు.

ముందు సీట్లో కూర్చున్న బేబీ నవ్వింది.

"ఏమిటి నవ్వుతున్నావు?" అడిగాడు అశోక్.

"ఏం లేదు! ఆ ఆఫీసుదగ్గర జరిగే పెళ్ళిళ్ళకు సాక్షి సంతకాలు చేసేందుకు వచ్చిన వాళ్ళను తలచుకుంటే తమాషాగా వుంది" అంది బేబీ.

"అది వాళ్ళ జీవనం" అన్నాడు అశోక్.

"ఇంత డబ్బుండి దిక్కులేనట్లు ఎవరో కొధకల్ని సాక్షులుగా డబ్బిచ్చి తెచ్చుకోవడం నాకు నచ్చలేదు!" అన్నాడు బాస్.

అశోక్ జవాబు చెప్పకుండా కూర్చున్నాడు.

కారు ఎమరాల్డ్ హౌస్ ముందాగింది.

"నాన్నా! పదినిముషాల్లో వచ్చేస్తాం! మీరు కూర్చొనుండండి" చెప్పింది బేబీ కారుదిగుతూ.

అశోక్ కూడా కారు దిగాడు. ఇద్దరూ వెళ్ళి తారాచంద్‌ను కలుసుకుని అంతకుముందు తాము ఆర్డర్ చేసిన నెక్లెను డెలివరీ తీసుకున్నారు.

అట్టపెట్టె విప్పిచూసి ఆనందంతో ఎగిరి గంతేసింది బేబీ. మిగిలిన డబ్బుకు చెక్ రాసి ఇచ్చింది. తారాచంద్ అందుకున్నాడు దాన్ని. గుమ్మందాకా సాగనంపాడు ఇద్దర్నీ.

స్వప్న, అశోక్‌ను చూసి నవ్వింది. అశోక్ కూడా నవ్వాడు. ఇద్దరూవచ్చి కారెక్కారు.

ఆ రాత్రి ఓషియానిక్ హోటల్ అంతా రంగురంగుల దీపాలతో వెలిగిపోయింది.

ఎనిమిదిగంటలనుండి ఆహ్వానితులు రావటం మొదలెట్టారు. గ్రే కలర్ సూట్ వేసుకున్నాడు అశోక్. గులాబీ రంగు చీర, జాకెట్ ధరించింది బేబీ. తారాచంద్ వద్దకొన్న నెక్లెను పెట్టుకుంది.

పదిగంటల ప్రాంతంలో ప్రఖ్యాత సినీనటి శమంతక మణి వచ్చింది.

ఆమె బేబీకి స్నేహితురాలు. బొంబాయికి వచ్చినప్పు డల్లా బేబీతోనే వుంటూ వుంటుంది. ఊటీకి ట్రంకాల్ చేసి తన పెళ్ళిగురించి చెప్పి ఎలాగైనా పార్టీకి రమ్మని కోరింది. శమంతకమణి కాదనకుండా వచ్చింది.

"ఏమిటి ఇంత ఆలస్యంగా వచ్చావ్?" అడిగింది బేబీ.

"ఇంట్లో దొంగలుపడ్డారు. నగలన్నీ ఊడ్చుకు పోయారు. కంప్లయింట్ ఇచ్చాను. వాళ్లు వచ్చి గంటసేపు పరిశోధిస్తూ కూర్చున్నారు. వాళ్ళు వెళ్ళాక బయలుదేరి వచ్చాను."

"దొంగలా! నగలన్నీ పోయాయా?" అడిగాడు అశోక్ ఆమె అందాన్ని తేరిపార చూస్తూ.

"మొత్తం పోయాయి. దాదాపు పదిలక్షల ఖరీదు వుంటాయి" అంది శమంతకమణి.

"అంత అజాగ్రత్తగా ఎందుకున్నావ్?" అడిగింది బేబీ.

"అజాగ్రత్త ఏమీలేదు. అంతా పకడ్బందీగానే వుంది. ఎప్పుడూ ఇలా జరగలేదు. ఇంట్లో పనివాళ్లుకూడా ఏమీ తెలీదంటున్నారు. తాళాలన్నీ తీశారు. వేశారు. మీ కంపెనీలో తయారయిన లైన్ సేఫ్ అమర్చారు మా ఇంట్లో. అది దొంగలకు అలవికాదు. దాన్ని ఓపెన్ చెయ్యడంకూడా కష్టం. కానీ వీళ్లు దాన్నికూడా ఓపెన్ చేశారు" చెప్పింది శమంతకమణి. ఆమెను చూస్తేనే విచార సముద్రంలో మనిషి మునిగిపోయినట్లుగా తెలుస్తూంది.

లైన్ సేఫ్ కంపెనీ బేబీ వాళ్ళదే. అశోక్ ఆ కంపె

నీకే జనరల్ మేనేజర్ గా వుంటున్నాడు. దాంతో పాటు మరో ఆరు బిజినెస్ లుకూడా వున్నాయి. బేబీకి లైన్ సేఫ్ ల గురించి తెలుసు. దాంట్లోవున్న వస్తువుల్ని దొంగి లించడమంటే వాళ్ళెవరో ఆసాధ్యులయి వుండాలను కొంది.

"పోలీసు లేమన్నారు?" అడిగాడు అశోక్.

"ఈ సేఫ్ ల విషయం తెలిసిన వాళ్ళెవరో ఆ పని చేసి వుండాలన్నారు. అందుకని దొంగను పట్టుకోవడం ఆలస్య మవుతుండేగానీ, ఖచ్చితంగా పట్టుకోగల మన్నారు" అంది శమంతకమణి.

"దొంగతనం ఎప్పుడు జరిగింది?"

"తెలీదు! నేనివాళే వచ్చాను. పార్టీకి వచ్చేందుకు అలంకరించుకోను నగలు తీసుకుందామని సేఫ్ తెరిచాను. అందులో ఏంలేదు. మొత్తం ఖాళీ. వెంటనే పోలీసులకు ఫోన్ చేశాను."

"సారీ! శమంతా. పార్టీ అయ్యాక వెళ్ళిపోవు. ఏం చెయ్యాలో ఆలోచిద్దాం!" అంది బేబీ.

అశోక్ ఆలోచనలో పడ్డాడు. ఆ దొంగతనం ఎవరు చేసి వుంటారాని ఊహించసాగాడు.

అంతలో పోలీస్ వ్యాన్ వచ్చి ఆగింది. అందులోనుండి ఇద్దరు ఇన్స్పెక్టర్లు దిగారు.

వాళ్ళను చూడగానే అశోక్ కాస్త కంగారు పడ్డాడు.

బుర్రమీసాలతో లావుగావున్న ఇన్ స్పెక్టర్ అశోక్ దగ్గరకొచ్చి "నా పేరు రాయుడు! మీరేదో ఘంక్షనులో వున్నట్లున్నారు. ఐదు నిముషాలు మీతో మాట్లాడాలి! ఇలా వస్తారా?" అడిగాడు అశోక్ ను.

బేబీ కలవరపడింది.

"అలాగే!" అంటూ అక్కడ్నుంచి తిన్నగా రాయుడి వెంట ఓ ప్రక్కకు వెళ్ళాడు అశోక్.

"లైన్ సేఫ్ కంపెనీకి మీరు జనరల్ మానేజర్‌గా పని చేస్తున్నారు కదూ!" అడిగాడు రాయుడు బుర్ర మీసాలు త్రిప్పుకుంటూ.

"అవును!" అన్నాడు అశోక్.

"మీ కంపెనీ సేఫ్ అమర్చిన శమంతకమణి అనే పెద్ద సినీతార ఇంట్లో దొంగతనం జరిగింది. వెళ్ళి వాకబు చేశాం. మాకు తెలిసిందాన్ని బట్టి సేఫ్ తెరవడం అసాధ్యం. బర్గలర్ కంట్రోల్ కూడా వుంది. ఓపెనింగ్ స్విచ్‌లు బాత్‌రూంలో వున్నాయి. దాన్ని ప్లాన్ చేసింది మీ కంపెనీయే. దొంగ మీ కంపెనీవాడన్నా కావాలి. లేదా మీ కంపెనీలో పని చేసే వాళ్ళెవరన్నా రహస్యాలు చెప్పివుండాలి!"

"మీ అనుమానం కరెక్ట్!" అన్నాడు అశోక్.

"మీ కెవరిపైనన్నా అనుమానం వుందా?"

అశోక్ తన కంపెనీ గురించి వివరంగా చెప్పాడు. ఆ సేఫ్‌లను అమర్చినప్లాన్లు, ఓపెనింగ్ స్విచ్‌లు ఎక్కడ వుంచిందీ మొదలైన వివరాలు నమోదు చేసిన రికార్డుబుక్ తన కస్టడీలోనే వుంటుందని ఒప్పుకున్నాడు. తనకు తెలీకుండా తియ్యగలిగింది ఒక్క మానేజర్ మాధవ రావు మాత్రమేనని చెప్పాడు.

"మీ మేనేజర్ మాధవరావును ఎవరో రివాల్వరుతో కాల్చి చంపారు?"

"మైగాడ్! ఎప్పుడు? ఎక్కడ?"

"ఇంట్లోనే. సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో చనిపోయి వుంటాడని మా డాక్టరు అనుమానిస్తున్నాడు.

అతన్ని సోదా చేశాం. అతని దగ్గర మొత్తం వెయ్యి రూపాయలున్నాయి" అన్నాడు రాయుడు.

"అతని జీతం నాలుగువందలే!" అన్నాడు అశోక్.

"అంటే అతనే ఎవరికో సమాచారం ఇచ్చివుంటాడు. అందుకు ప్రతిఫలంగా వెయ్యి రూపాయలు తీసుకొని వుంటాడు. దొంగతనం గురించి శమంతకమణి తెలుసుకోగానే పోలీసులకు ఫోన్ చేస్తుందనీ, మేము మాధవ రావును అనుమానిస్తామనీ వాళ్లు ఊహించి వుంటారు. తమ ఆచూకీ అతనిస్తాడేమోనన్న అనుమానంతో వెంటనే అతన్ని హత్యచేసి వుండాలి" అన్నాడు రాయుడు.

అశోక్ ఏమీ మాట్లాడలేదు.

"ఓమారు మీరు ఆఫీసుదాకా వస్తారా? ఆ రికార్డు బుక్ చూద్దాం! అలాగే మాధవరావు ఎక్కడన్నా ఏమన్నా రాసిపెట్టాడేమో చూద్దాం!" అన్నాడు రాయుడు.

"పార్టీ జరుగుతూంది. చాలామంది వచ్చారు. పైగా ఇది మారేజ్ పార్టీ. ఒక గంటలో అయిపోతుంది. ఆ తర్వాత నేను మీ వెంట ఎక్కడికి రమ్మంటే అక్కడికొస్తాను" అన్నాడు అశోక్.

రాయుడు ప్రక్కనున్న ఇన్‌స్పెక్టర్ కేసి చూశాడు.

"శమంతకమణిని ఇంకోమారు కలుసుకోవాలి! ఈలోగా అక్కడికెళ్ళి వద్దాం!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఆమెకూడా ఇక్కడే వుంది!" చెప్పాడు అశోక్.

"అయితే మేముకూడా పార్టీలో వుంటాం. అంతా అయ్యాక వెళ్ళొచ్చు" అన్నాడు రాయుడు.

"చాలా సంతోషం! రండి. డిన్నర్ సర్వ్ చేస్తున్నారు," అన్నాడు అశోక్.

ఇన్‌స్పెక్టర్స్ ఇద్దరూ జనంలోకి వెళ్ళారు. అశోక్

వచ్చి బేబీ ప్రక్క నిలబడ్డాడు.

"ఏమంటున్నారు?" అడిగింది.

టూకీగా జరిగిందంతా చెప్పి "మన మాధవరావును హత్యచేశారట దొంగలు. రివాల్వర్‌తో దారుణంగా కాల్చి చంపారని చెప్పాడు ఇన్‌స్పెక్టర్. పూర్ ఫెలో. చాలా కష్టపడి పనిచేసేవాడు" అన్నాడు అశోక్.

"ఆ కంపెనీ రేపే అమ్మేద్దాం!" అంది బేబీ దృఢ నిశ్చయంతో.

"ఏం? ఎందుకని?"

"ఈ పోలీసు గొడవలు నాకు నచ్చవు. ఎవరింట్లోనో దొంగతనం పోవటం, దానికి మనల్ని వేళా పాళా లేకుండా వచ్చి అల్లరిచెయ్యడం, ఈ నాన్సెన్సంతా నేను భరించలేను," అంది బేబీ.

ఇంక ఆమెతో మాట్లాడి లాభంలేదని నోరు మూసుకుని డిన్నర్ టేబుల్స్ వేపు ఆమెను నడిపించుకుపోయాడు.

8

లైన్ సేఫ్ కంపెనీ ముందాగింది పోలీస్ జీప్. అందు లోంచి రాయుడు, అతని సహచరుడూ, అశోక్ క్రిందికి దిగారు.

ఆఫీసు తాళాలు తెరచి లోనికి వెళ్ళారు ముగ్గురూ.

అశోక్ తన గది తలుపులు తెరచి అందులో అమర్చిన లైన్ సేఫ్ తెరచి లావుపాటి రికార్డుబుక్ వెలుపలికిలాగి, రాయుడికి అందించాడు.

ఇదేమిటన్నట్లు చూశాడు అశోక్ కేసి రాయుడు.

"మేము మద్రాసు సర్కిల్‌లో ఫిటప్ చేసిన సేఫ్ తాలూకు ప్లాన్లు మొత్తం సీరియల్ నెంబరు ప్రకారం అంగుల్లో వున్నాయి" అన్నాడు అశోక్.

రాయుడు మెల్లగా ఒక్కొక్కటి తిరగవేయ సాగాడు. పేర్లు చదువుతూ పేజీలు తిరగేస్తూపోయాడు. మొత్తం పూర్తయ్యేసరికి అందులో రెండు ప్లాన్లు లేవని అర్థమయింది. ఆ రెండు బలంగా చింపినట్లు గుర్తించాడు. ఫైలింగ్ క్లిప్‌కు తగులుకొని చినిగిన కాగితం ముక్కలు కనుపించాయి.

“నలభై ఎనిమిదో నెంబరు ప్లాను, తొంభై రెండో నెంబరు ప్లాను లేవండీ ఇందులో” అన్నాడు రాయుడు.

“నిజంగా!” అన్నాడు అశోక్ ఆతృతగా రికార్డ్ బుక్ అందుకొని.

“నిజంగానే లేవు!” అన్నాడు రాయుడు.

అశోక్ వడివడిగా వరుస నెంబర్లు చెక్ చేశాడు. శమంతకమణిది నలభై ఎనిమిదో నెంబరు ప్లాను. తొంభై ఎనిమిదో నెంబరు డాక్టరు జార్జిది. రెండూ బుక్‌లోంచి చింపేశారు.

“ఎవరు చింపారు వాట్ని?” అడిగాడు రాయుడు.

“ఏమోనండీ! మొన్న రాత్రినుండి నేను ఆఫీసుకు రాలేదు. మా బాస్ బొంబాయినుండి వచ్చాడు. వాళ్ళ వెంట తిరగడం, వాళ్ళకు సౌకర్యాలు సమకూర్చడం సరిపోయింది. ఇప్పుడు మీ వెంటే మళ్ళీ ఆఫీసుకొచ్చాను” అన్నాడు అశోక్.

“లోనికొచ్చేందుకు తాళాలు మీ దగ్గరకెలా వచ్చాయి?”

“ఆఫీసుకొక జత, నాకు వేరే జత వున్నాయి.”

“ఆఫీసు తాళాలు ఎవరిదగ్గర వుంటాయి.”

“మాధవరావు దగ్గర.”

“అంటే మీరుగానీ, మాధవరావుగానీ, ఏ టయిమ్‌లో కావాలన్నా రావచ్చన్న మాట.”

"రావచ్చండి!"

"మాధవరావెలాంటివాడు?" అడిగాడు ప్రక్కనున్న ఇన్‌స్పెక్టర్.

"నాకు తెలిసినంతవరకు చాలా మంచివాడే! డబ్బు కోసం కంపెనీ రహస్యాల్ని అమ్ముకొనేంత నీచుడు కాడు" అన్నాడు అశోక్.

"నిన్న మీరు ఆఫీసుకు రాలేదన్నారు. మాధవరావు ఏమైనా ఆర్డరు బుక్ చేశాడేమో చూడండి. రిసెప్షన్ రిజిస్టరులో నిన్న ఎవరెవరు లోనికొచ్చింది రాసి వుంటుం దిగా. అదికూడా కాస్త చూపించండి" అన్నాడు రాయుడు.

అశోక్ పది నిముషాలు తంటాలుపడి ఆర్డర్ బుక్, విజిటర్స్ బుక్ వెతికి తీసుకొచ్చాడు.

"ఆర్డర్ బుక్ ప్రకారం నిన్న మాధవరావు బుక్ చేసింది ఒకటే ఆర్డరు. అతని పేరు, అడ్రసు ఈ డూప్లికేట్ పైన వుంది. వెయ్యి రూపాయలు అడ్వాన్సు ఇచ్చాడు" అన్నాడు అశోక్.

రాయుడు అతని పేరు అడ్రసు రాసుకొన్నాడు. విజిటర్స్ బుక్‌లోంచి కొన్ని అడ్రసులుకూడా నోట్ చేసు కున్నాడు. ఆ తర్వాత ముగ్గురూ వెలుపలికొచ్చి జీప్ ఎక్కారు. జీపు బయలుదేరింది.

అశోక్‌ను ఓషియానిక్ హోటల్‌లో దించి, రాయుడు జీప్‌ని తిన్నగా ఎడ్వర్డ్ ఇలియట్స్ రోడ్‌కు పోని చ్చాడు. తనకు కావలసిన నెంబరుకోసం వెతుక్కుంటూ పోసాగాడు మెల్లగా జీప్‌లో.

ఆరో నెంబరు వేసివున్న కాంపౌండ్ ముందాగాడు. దానిపైనున్న పెద్ద సైన్‌బోర్డుకేసి చూశాడు. "రాజేశ్వరి కల్యాణ మండపం" అని వుంది. నవ్వుకొన్నాడు.

రామ్మూర్తి అన్న పేరుతో ఆర్డరు బుక్ చేసిన ఆగంతకుడే; లైన్ సేఫ్ కంపెనీలోంచి ప్లాన్లు రెండూ దొంగిలించి వుండాలని తీర్మానించుకున్నాడు. అందుకే అతను దొంగ పేరూ, అడ్రసూ, ఇచ్చి వుంటాడనిపించింది.

అతన్నెలా పట్టుకోవాలాని ఆలోచించసాగాడు. మెరుపులా ఆలోచన వచ్చింది. అతను రెండు ప్లాన్లు దొంగిలించాడు. శమంతకమణి యింట్లో దొంగతనం చేశాడు. పోతే మిగిలింది డాక్టర్ జార్జి ఇల్లు. ఆ ఇంటికి ఘట్టి కాపలా ఏర్పాటుచేస్తే, పిట్టలు వల్లో చిక్కచ్చనిపించింది.

9

"మాధవరావును నువ్వు చంపకుండా వుండవల్సింది" క్రిస్టోఫర్‌తో అన్నాడు జాన్.

"ఏం? ఎందుకని?" అడిగాడు క్రిస్టోఫర్.

"అనవసరంగా పోలీసులు రంగంలోకి దిగారు. వాళ్ళకు లైన్ సేఫ్ కంపెనీలో ప్లాన్లు పోయినట్లు తెలుస్తుంది. దాంతో మనం ఇంకెక్కడా దొంగతనం చేసేందుకు వీలేకుండా పోతుంది" అన్నాడు జాన్.

"శమంతక మణి తిరిగొచ్చిందాకా అసలు దొంగతనం జరిగిందన్న విషయం తెలీదు. నేను మారువేషంలో వెళ్ళాను. మాధవరావు మంచి నిద్రలో వున్నాడు. సైలెన్సర్ అమర్చిన రివాల్వరుతో అతన్ని కాల్చి చంపాను. నన్నెవ్వరూ చూడలేదు. నా ఆచూకీ తెలుసుకోవడం కష్టం. అంతకైతే డాక్టర్ జార్జ ఇంటిపై యీ రాత్రికే దాడిచేసి, దొరికిన సొమ్ముతో ఎటైనా వెళ్ళిపోదాం!"

అప్పుడే లోనికొచ్చింది స్వప్న, అతని మాటలు సగం వినింది.

"శమంతకమణి వచ్చేసింది" చెప్పింది స్వప్న కూర్చుంటూ.

"ఎప్పుడు?"

"ఈ రాత్రి."

"ఎందుకొచ్చింది."

"ఒక పెళ్ళిపార్టీ అటెండయేందుకు. మరో విషయం పోలీసులు అశోక్‌ను అనుమానిస్తున్నట్లుగా వుంది" అంది స్వప్న.

"థాంక్ గాడ్! ఇంకా నీకు ఏవైనా వివరాలు తెలిశాయా?"

"లేదు. అశోక్‌ను ఇక్కడకు రమ్మని ఇప్పుడే ఫోన్ చేశాను. బహుశా, అతను పది నిముషాల్లో వస్తాడను కుంటాను."

"అతనెందుకు? అయితే మేము వెళ్ళిపోతాం. అతను మమ్మల్ని చూడడం మంచిదిగాదు!" అన్నాడు క్రిస్టోఫర్.

"మీరు వేరే రూంలో వుండండి" అంది స్వప్న.

క్రిస్టోఫర్, జాన్ లేచి వెళ్ళారు.

స్వప్న బీర్ తెప్పించుకుంది. గ్లాసులో పోసుకొని కొద్ది కొద్దిగా చప్పరిస్తూ అశోక్ రాకకోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

తలుపులు తెరుచుకున్నాయి. తలెత్తి చూసింది స్వప్న. అశోక్ లోనికొచ్చాడు.

"ఎందుకంత అర్జంటుగా రమ్మని ఫోన్ చేశావ్?" అడిగాడు అశోక్ కూర్చుంటూ.

"మనిద్దరం ప్రేమించుకున్నాక, ఆరోజుల్లో తమాషాగా నీతో డబ్బు సంపాదించేందుకు సులభమైన మార్గాలు కొన్ని చెప్పాను. అవునా?" అడిగింది స్వప్న.

"అయితే!"

"డబ్బుకు అమ్ముడుపోయే నీచుడివి. నువ్వెంత ఘోరమైనా చేస్తావ్. మీ బాస్ కూతురిలో ఏముందని పెళ్ళాడావ్. డబ్బు తప్ప" అడిగింది స్వప్న.

"దానికీ, నువ్వు చెప్పేదానికీ ఏ సంబంధం లేదు."

"నాపైన పోలీసులు అనవసరంగా అనుమాన పడుతున్నారు. నన్ను రహస్యంగా వెంటాడుతున్నారు. నన్నేమైనా వాళ్ళు ఇబ్బంది పెట్టే పక్షంలో నేను నిన్ను పతికదాకా ఇరికిస్తాను. జాగ్రత్త!" అంది స్వప్న.

"నిన్ను పెళ్ళాడలేదన్న కోపంతో నాపైన ఈ విధంగా పగ తీర్చుకోవడం అన్యాయం. నన్ను అనవసరంగా ఈ గొడవల్లోకి లాగొద్దు. నీకెంత కావాలంటే డబ్బిస్తాను" అన్నాడు అశోక్.

"ఎంతిస్తావ్?" అడిగింది స్వప్న.

"ఎంత కావాలి?"

"నీ భార్య నిన్న పార్టీలో అలంకరించుకొన్న నెక్లెస్ ఇస్తావా?"

"ఆమెకు తెలుస్తుంది. లేనిపోని గొడవ అవుతుంది."

"అవన్నీ నాకవసరం లేదు. నా కా నెక్లెసు కావాలి. అది తెచ్చిస్తానంటే నిన్ని గొడవలోకి లాగకుండా వదిలేస్తాను. లేకుంటే ఆ ప్లాన్లు నువ్వే నాకిచ్చావని చెప్తాను" అంది స్వప్న.

"సరే! అలాగే తెచ్చిస్తాను" అన్నాడు అశోక్.

"ఈ రాత్రికే నాకు తెచ్చివ్వాలి" అంది స్వప్న.

"అలాగే" అంటూ అశోక్ బయటికి పోయాడు. కారెక్కి తిన్నగా హోటల్ కు దారితీశాడు.

10

అర్ధరాత్రి—

క్రిస్టోఫర్, జార్జి యింటికి ముందు నిలబడ్డాడు. జాన్

లోనికి వెళ్ళాడు. స్వప్న కూడా అతని వెంట లోనికి వెళ్ళింది. ఇద్దరూ మెల్లెగ్గా జార్జి ఫ్లాట్ ముందు నిలబడ్డారు.

జాన్ స్క్రూడ్రైవరుతో పని ప్రారంభించాడు తాళంకప్ప తెరిచేందుకు.

స్వప్న ప్రక్కనే నిలబడి చూడసాగింది. రెండు నిము షాల్లో తలుపు తెరుచుకుంది. ఇద్దరూ లోనికి వెళ్ళారు. లోపల్నుంచి తలుపుమూసి గడియ పెట్టుకున్నారు.

జాన్ ప్లాన్ పరిశీలించి చూచి బాత్ రూంలోకి వెళ్ళాడు. లైటు వేశాడు. వెలిగి ఆరిపోయింది.

"స్వప్నా! లైటారిపోయింది. కరెంటు పోయిందేమో?" అన్నాడు జాన్.

"టార్చిలైటు వెలిగించి స్విచ్ చూడు."

"లాభంలేదు. కరెంటుతోనే స్విచ్ పనిచేస్తుంది. అది పనిచేస్తేనే సేఫ్ తెరుచుకుంటుంది" చెప్పాడు జాన్.

"ఉన్నట్టుండి కరెంటు ఎలా పోయింది?"

"ఏమో?"

"ఎవరన్నా మెన్ ఆపేశారేమో?"

"అంటే పోలీసులొచ్చి వుంటారనా నీ అనుమానం" అడిగాడు జాన్.

"ఎందుకయినా మంచిది, ఎలక్ట్రిసిటీ ఆఫీసుకు ఫోన్ చేసి చూద్దామా" తనకు తోచిన సలహా ఇచ్చింది.

"వద్దు! కిటికీతీసి ప్రక్కింటికేసి చూడు. కరెంటున్నదీ, లేనిదీ తెలుస్తుంది" అన్నాడు జాన్.

స్వప్న అలాగే చూసింది. ప్రక్కనున్న ఇంట్లోంచి ఫాన్ జాయ్‌మని తిరుగుతున్న శబ్దమైంది.

"కరెంటుంది!" తిరిగొచ్చి చెప్పింది భయపడుతూ.

"అయితే ఎవరో కరెంటు కావాలనే తీసివేశారు. క్రిస్టోఫర్ ఏమయినట్లు. ఎవరన్నా ఇటువేపు వస్తే మనల్ని హెచ్చరించమని చెప్పాముగా" అన్నాడు జాన్.

"అతన్ని పట్టుకొన్నారేమో? మన గతేమిటి?"

"మెల్లగా తలుపు తెరుచుకొని వెళ్ళిపోదాం! వాళ్ళు అతన్ని పట్టుకొని వెళ్ళిపోయారేమో? ఏ పరిస్థితుల్లోనూ మన ఆచూకీ అతను ఇవ్వడు."

జాన్ తలుపువేపు నడుస్తూ అన్నాడు. స్వప్నకూడా వెంట వెళ్ళింది. చెవులు రిక్కించి విన్నారు. ఏవిధమైన శబ్దం వినిపించలేదు.

జాన్ తలుపు తెరిచిచూశాడు. చీకటిగా వుంది. మనిషెవ్వరూ అక్కడ నిలబడ్డజాడ కనుపించలేదు. స్వప్నను రమ్మని మెట్లు దిగసాగాడు. రెండో అంతస్తు దిగుతుండగా, ఎదురుగా రివాల్వర్లు పట్టుకొని వరుసగా నిలుచున్న పోలీసుల రూపాలు చీకట్లో చూచాయగా కనుపించాయి.

"చిక్కిపోయాం!" అన్నాడు జాన్.

స్వప్న కుప్పలా కూలిపోయింది.

లైట్లు వెలిగాయి. రాయుడు ఇద్దరికీ బేడీలు తగిలిస్తూ "మీరింత త్వరగా వస్తారనుకోలేదు. కానీ ఇవాళే చిక్కిపోయారు!" అన్నాడు.

ఇద్దరూ మాట్లాడకుండా వెంట నడిచారు.

కార్లో క్రిస్టోఫర్ కూడా కలిశాడు. అతనికి అంతకు ముందే అరదండాలు తగిలించారు.

ముగ్గుర్నీ కారెక్కించారు. ముందొక జీపు, వెనుకొక జీపుతో బయలుదేరింది దొంగల్ని కూర్చోపెట్టిన వేను.

వైర్‌లెస్ మ్రోగింది.

ఫోను తీసుకున్నాడు రాయుడు.

"హలో! రాయుడు స్పీకింగ్! ప్రఖ్యాత బిజినెస్ మాన్ రామ్మూర్తి అల్లుడూ, లైన్ సేఫ్ కంపెనీలో జనరల్ మేనేజర్ అయిన అశోక్ భార్యను మత్తుమందిచ్చి ఆమె మెళ్ళోవున్న ఏడులక్షల రూపాయల ఖరీదుచేసే నెక్లెసుతో పరారయినట్లు కంప్లెయింట్ వచ్చింది. వెంటనే ఎంక్వయిరీ ప్రారంభించండి" అన్నాడు పోలీస్ కంట్రోల్ రూంలోవున్న ఆనౌన్సరు.

రాయుడు స్వప్న అడ్రసు చెప్పి, ఆచుట్టుప్రక్కల గానీ, ఆ యింట్లోగానీ అశోక్ దొరుకుతాడని, అతన్ని పట్టుకొని తీసుకురమ్మని ముందున్న జీపును పురమాయించాడు.

రాయుడు చేరిన ఇరవై నిముషాలకు పోలీస్ జీప్ అశోక్‌ను తీసుకొచ్చింది. మరికాస్సేపట్లో సేఠ్ తారాచంద్‌నుకూడా అరెస్ట్ చేసి తీసుకొచ్చారు.

అందరూ ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

"అశోక్‌ను అనుమానించాను. అతను నిరపరాధి. అలా అనుమానించడంవల్లే అసలు గాంగు చిక్కింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రాయుడు.

"మీరెలా అనుమానించారు అతన్ని" అడిగాడు క్రిస్టోఫర్.

"స్వప్నకూ, అతనికీ పాత పరిచయం వుంది. లైన్ సేఫ్ కంపెనీకి అతను జనరల్ మేనేజర్ కావడంవల్ల, అతనిపైన ఎక్కువ అనుమానపడ్డాను" అన్నాడు రాయుడు.

"అలా భయంపెట్టే స్వప్న నాచేత నా భార్య నెక్లెసు దొంగలించేందుకు నన్ను తయారుచేసింది. ఆమె నన్నేమనుకొందో!" అన్నాడు అశోక్ విచారంగా.

"నువ్వేం కంగారు పడకు! నీ భార్యకు నేను చెప్తాను అసలు సంగతి" అన్నాడు రాయుడు.

"నాకేం చెప్పనవసరంలేదు. ఆయన పాలల్లో మత్తు మందు కలపడం గమనించాను. తెలివిగా వాటిని త్రాగకుండానే మత్తుగా వుందంటూ పడుకున్నాను. కంటసేపు అటూ ఇటూ తిరిగి ఆ తర్వాత నా నెక్లెసు తీసుకొని వెళ్ళిపోయారు. నాకు భయం వేసింది. ఆయన దొంగతనం చెయ్యడం నాకు బాధ కలిగించింది. ఆయన అంత నీచానికి పాలుపడే మనిషి కాదు. అంటే ఏదో పెద్ద గొడవలో పడ్డారన్నమాట. అందుకే వెంటనే పోలీసులకు ఫోన్ చేశాను. చాలా థాంక్స్. ఆయనకే అపకారం జరగక ముందేపట్టుకున్నారు" అంది బేబీ.

"నన్ను క్షమించు బేబీ!" అన్నాడు అశోక్.

బేబీ నవ్వుతూ "మీ బాధ నాకుచెప్తే ఇంతగొడవ జరగకపోయేది," అంది. ఆమె మంచి మనసుకు అశోక్ హృదయం ఆనందంతో పొంగిపోయింది.

—:ఐ పో యి ం ది:—